



● గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటి సరఫరా

నీటి విడుదలపై.. నియంత్రణ ఏదీ?

నాగార్జున సాగర్ జలాశయంలోని నీటి వినియోగంపై నియంత్రణ కొరవడింది. ఇరు రాష్ట్రాలు ఇష్టారాజ్యంగా నీటిని వినియోగించుకుంటున్నాయి. 95 రోజుల్లో 122 టీఎంసీల నీటిని వాడేశారు. సాగర్ నీటి మట్టం 538 అడుగులకు పడిపోయింది. నవంబరు 12న పూర్తి స్థాయిలో నీటి మట్టం ఉండగా రోజురోజుకూ పడిపోతోంది. నీటిని పొదుపుగా వాడటంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజూ సాగర్ నుంచి 20,998 కూసెక్కుల నీటిని వాడేస్తున్నారు. కుడి కాలువకు 10 వేల కూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదే స్థాయిలో తెలంగాణ కూడా నీటిని వినియోగించుకుంటున్నది. ఇరు రాష్ట్రాలు పోటీ పడి సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తుండటం తో వేసవిలో పరిస్థితి ప్రమాదకరంలో పడవచ్చనే అభిప్రాయాన్ని జలవనరుల నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సాగు దాదాపు పూర్తయింది. ఖరీఫ్‌కు సంబంధించి మిరప సాగు మాత్రమే ఉంది. మిరపకు మార్చి ఆఖరు వరకు నీటి సరఫరా అవసరం ఉందని అంచనా. పల్నాడు జిల్లాలో రబీలో వరి సాగు కూడా పెద్ద ఎత్తున చేశారు. ఈ రెండు పంటలకు నీటి అవసరం ప్రధానంగా మార్చి చివర వరకు ఉంది. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో రబీలో వేసిన మొక్కజొన్న, పొగాకు వంటి ఇతర పంటలు చివరి దశకు వచ్చాయి. వాటికి నీటి అవసరం లేదు. ఈ నేపథ్యంలో సాగర్‌లో ఉన్న నీటిని పొదుపుగా వాడాల్సిన అవసరం ఉండగా ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న వాదన రైతుల నుంచి కూడా వ్యక్తమవుతోంది. కుడి కాలువ పరిధిలో అన్ని మేజర్లు, మైనర్ల పరిధిలో సాగునీరు అవసరం లేదు. పంటలు ఉన్న ప్రాంతాన్ని గుర్తించి ఆ పరిధిలోనే నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఖరీఫ్‌లో అన్ని పంటలు వేసినప్పుడు ఎలా అయితే నీరు వదులుతారో, అదే విధంగా దాదాపు అన్ని కాలువలకు నీటి సరఫరా జరుగుతోంది. వరి నాట్లు కూడా పూర్తయ్యాయి. మిరపకు ఆరు తడులు సరిపోతాయి. వరికి కూడా వార బందీ అమలు చేసినా సాగునీరు సరిపోతుందనేది అంచనా. పంటలు సాగు చేసిన ప్రాంతాలకు మాత్రమే సాగు నీరు సరఫరా చేసే విధంగా జలవనరుల శాఖ ప్రణాళిక కను రూపొందించాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో పంటలు లేకున్నా సాగునీరు పొలాల్లో వృధాగా ప్రవహిస్తోంది. అలాగే వాగుల్లో కూడా నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తున్నది. అవసరం ఉన్న కాలువలకు మాత్రమే నీటిని సరఫరా చేసేందుకు చర్యలు లేవు. కొన్ని కాలువలకు నీటి సరఫరాను నిలిపివేసేందుకు షట్టర్లు లేవని చెబుతున్నారు.

- అవసరం లేని కాలువలకూ నీటి విడుదల
- వాగుల్లో పారుతున్న కృష్ణా జలాలు
- కుడి కాలువకు 10వేల క్యూసెక్కుల నీటి సరఫరా
- 538 అడుగులకు పడిపోయిన సాగర్ నీటి మట్టం

దీని వలన అవసరం లేని ప్రాంతాలకు కూడా నీటి సరఫరా జరుగుతోంది.

అధికారులు దృష్టి సారించాలి

ఏ కాలువ పరిధిలో ఏ ఏ పంటలు సాగులో ఉన్నాయి. ఏ మేరకు నీటి సరఫరా అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేయాల్సి ఉంది. పంటలు లేని ప్రాంతంలోని కాలువకు నీటి సరఫరా నిలిపివేయాల్సి ఉంది. వార బందీ అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాలి. మిరప.. వరి సాగు ఉన్న ప్రాంతాలను గుర్తించి అయా ప్రాంతాలకు నీటిని సరఫరా చేయడం వలన నీటి వృధాను అరికట్టే అవకాశం ఉంది. ఈ మేరకు జలవనరుల శాఖ అధికారులు స్పందిస్తేనే వేసవి కూడా సాగర్‌లో నీటి నిల్వ ఉంటుంది. లేకుంటే తాగునీటికి గడ్డు పరిస్థితులు నెలకొనే ప్రమాదం పొంచి ఉంది.

సాగర్‌లో నీటి నిల్వ ఇలా..

నాగార్జున సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు. సోమవారం 538.1 అడుగులు నమోదైంది. పూర్తి స్థాయి నీటి సామర్థం 312.05 టీఎంసీలు కాగా 184.39 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాగర్‌లోకి నీటి ప్రవాహం లేదు. జలాశయం నుంచి 20,998 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువకు 10,000 కూసెక్కులు.. ఎడమ కాలువకు 8,718 కూసెక్కులు.. ఎస్ఎల్‌బీసీకి 2,000 కూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. పంటల అవసరాలను గుర్తించి నీటి సరఫరా చేయకుంటే, సాగర్‌లో ఉన్న నీటి నిల్వ నిండుకోవడం ఖాయం. ఉన్న నీటి నిల్వ 512 అడుగులకు తగ్గితే 136 టీఎంసీల నీటి నిల్వ ఉంటుంది. అంటే ఈ స్థాయికి నీటి మట్టం చేరే వరకు ఇంకా 45 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా నీటి సరఫరాపై జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం కాకుంటే వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. దీనిని ఇప్పటికైనా అధికారులు గుర్తించి మేల్కోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

నాగార్జున సాగర్ జలాశయంలో పడిపోయిన నీటి నిల్వ



ముంచుకొచ్చిన.. మృత్యువు

వారంతా రెక్కాడితేగానీ.. డొక్కాడని మహిళా కూలీలు. పొద్దునే లేచి, చద్ది కూడు తిని పొలం పనులకు పోయి పొట్ట నింపుకునే వారు. రోజూలాగే ఆ రోజూ చకచక ఇంటి పనులు ముగించుకొని పొలం పనులకు పయనమయ్యారు. కానీ వారికి తెలియదు వారెళుతుంది తిరిగిరాని లోకానికని. కూలీలందరూ ఓ ఆటోలో కిక్కిరిసి కూర్చున్నారు. వారికి తెలుసు అలా వెళ్లడం ప్రమాదకరమని, ఏదైనా జరిగితే భారీ మూల్యం చెల్లించాల్సిం దేనని.. పది రూపాయలు మిగులుతాయని ప్రమాదంపైనే ప్రయాణమయ్యారు. ఉదయాన్నే రోడ్డును పొగ మంచు కమ్మేసింది. 'ఇదిగో అబ్బాయ్ జాగ్రత్తగా నడుపూ..' అని అంటూనే ఉన్నారు. ఈలోపే దట్టమైన మంచును చీల్చుకొచ్చిన ఓ బస్సు వారి ఆటోను ఢీ కొట్టింది. ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు..

- ఆటోను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు
- ముగ్గురు మహిళా కూలీల మృతి
- ఎనిమిది మందికి గాయాలు
- క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌కి తరలింపు



ప్రమాదానికి గురైన ఆటో



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు



మృతులు అల్లంశెట్టి అరుణ,తోట సీతారాములు, కుర్రా నాంచారమ్మ

వైసీపీ ప్రభుత్వం సృష్టించిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఇప్పటికీ గందరగోళంలోనే కొనసాగుతూనే ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నెలకొన్న గందరగోళాన్ని సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టినప్పటికీ, అది ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది.



సచివాలయం.. గందరగోళం!

- హేతుబద్ధీకరణపై ప్రభుత్వం మల్లగుల్లాలు
- మాతృ సంస్థల్లో విలీనం చేయాలని డిమాండ్
- మల్టీ పర్పస్ ఫంక్షనరీస్ పేరుతో పని భారం
- స్పష్టమైన జాబ్ చార్ట్ విడుదల చేయాలని డిమాండ్
- మంత్రి డోలాకు విన్నవించిన సచివాలయ ఉద్యోగులు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను సృష్టించింది. పరిపాలనను ప్రజలకు చేరువ చేయడం అన్న పేరుతో రూపొందించిన ఈ వ్యవస్థ నిర్వహణ, పనివిధానానికి సంబంధించి విధివిధానాలు రూపొందించకుండా మొత్తంగా వ్యవస్థను గందరగోళం చేసింది. 2019లో కేవలం రెండు నెలల వ్యవధిలో లక్షా 30వేల మంది ఉద్యోగులను రిక్రూట్ చేసుకుని వారందరినీ గందరగోళంలో పడవేసింది. ఐదేళ్లపాటు వారిని పలు రకాల సేవల్లో వినియోగించుకున్న గత ప్రభుత్వం వారికి నిర్దిష్టమైన జాబ్ చార్టును కూడా రూపొందించకుండా నిర్లక్ష్యం చేసింది. ఉద్యోగులతో సంబంధం లేని పనుల్లో కూడా వాడుకుంటూ వారితో వెట్టి చాకిరీ చేయించుకుంది. గ్రామ పంచాయతీలకు సమాంతర వ్యవస్థలా సచివాలయాలను నడిపి పంచాయతీరాజ్ వ్యవస్థను నీరుగార్చింది. కనీసం వారికి డీడీవో అధికారాలు కూడా ఇవ్వకుండా చాకిరీ చేయించుకుంది. గతంలో సచివాలయ ఉద్యోగులకు సర్వీస్ అంశాలు మాతృశాఖ నుంచి జీతం మరొక శాఖ నుంచి పర్యవేక్షణ చేసిన పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన ఈ గందరగోళాన్ని తొలగించి, ఉద్యోగులను హేతబద్ధీకరించడానికి ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వం సవాళ్లను ఎదుర్కొంటోంది.



మిగులు ఉద్యోగులను ఏం చేయాలి?

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 568 సచివాలయాలు ఉండగా 4,780 మంది ఉద్యోగులు, పల్నాడు జిల్లాలో 537 సచివాలయాల్లో 4,494 మంది, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాల్లో 4,240 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా మూడు జిల్లాల్లో 1,582 సచి వాలయాల్లో 13,514 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణ వల్ల ఒక్కో సచివాలయానికి సగటున ఏడుగురు ఉద్యోగులు సరిపోతారు. దీంతో జిల్లాలోని మొత్తం సచివాలయాల్లో 11,074 మంది ఉద్యోగులు సరిపోతారు. ఇంకా 2,440 మంది ఉద్యో గులు మిగులుతారు. ఇలా మిగిలిన ఉద్యోగులను ఏం చేస్తారనేది ఉద్యోగులను వెంటాడుతున్న ఆందోళన.

మాతృ శాఖకు పంపాలంటూ వేడుకోళ్లు

రాష్ట్ర సచివాలయంలో గ్రామ, వార్డు సచివాలయాల శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో సచివాలయ ఉద్యోగులు తమ గోడును ఏకరువు పెట్టారు. సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించాలని విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణలో చెబుతున్న మల్టీ పర్పస్ ఉద్యోగుల విధానాన్ని తొలగిం చాలని ఉద్యో గులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ విధానంలో సొంత శాఖ విధులతో పాటు ఇతర శాఖల విధుల భారం కూడా ఉద్యోగులపై పడుతుందని ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయ ఉద్యోగులపై సచివాలయం పర్యవేక్షణ మాత్రమే ఉండాలని, మాతృశాఖ, సచివాలయం రెండింటి పర్యవేక్షణ ఉంటే అది గతంలో మాదిరిగా గందరగోళానికి దారి తీస్తుందని అంటున్నారు. సచివాలయ ఉద్యోగులకు నిర్దిష్టమైన జాబ్ చార్టును రూపొందించి అమలు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం పంచాయతీరాజ్ వ్యవస్థలో ఆరు గ్రేడులుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను 3 గ్రేడులకు కుదించాలని గ్రేడ్- 1,2 జోనల్ పోస్టులను గ్రేడ్- 1గా, గ్రేడ్- 3,4,5లను గ్రేడ్- 2గా, గ్రేడ్-6ను గ్రేడ్-3గా మార్చాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. సచివాలయం, పంచాయతీ డీడీవో, కన్వీనర్ బాధ్యతలు నిర్వహించే ఉద్యోగులకు హోదాకు తగినట్లుగా సీనియర్ అసిస్టెంట్ పే స్కేలు ఇవ్వాలని కోరారు.

హేతుబద్ధీకరణకు సంబంధించి గత నెల రోజులుగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అది ఇప్పటి వరకూ ఒక కొలిక్కి రాలేదు. ఉద్యోగుల హేతబద్ధమైన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని, శాస్త్రీయమైన పరిష్కారం కనుగొనలేకపోతే సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉంది.

సమన్వయంతో పని చేయాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆర్వో నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు సమ న్వయంతో విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో ప్రిసై డింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జిల్లా రెవె న్యూ అధికారి ఖాజావలితో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రిసై డింగ్ అధికారులు ఎన్నికలు జరిగే ముందురోజు డిస్ట్రిబ్యూష న్ సెంటరు నుంచి పూర్తి స్థాయిలో పోలింగ్ సామగ్రి తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటింగ్‌కు సంబంధించిన పూర్తి ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ రోజు ఉదయం 8 గంటల సమయానికి ఓటింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయంలో జరుగుతున్న అన్ని విషయాలపై నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం స్పందిస్తూ పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ప్రిసైడింగ్ అధికారి డైరీతో పాటు, ఇతర నాన్ స్టాట్యూటరీ, స్టాట్యూటరీ ఫారంలను సక్రమంగా పూర్తి చేసుకొని, బ్యాలెట్ బాక్స్‌లు సక్రమంగా సీజ్ చేసి రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్నప్పటి నుంచి తిరిగి వాటిని రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించే వరకు ప్రిసైడింగ్ అధికారులు అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులను ఫిబ్రవరి 20వ తేదీ నాటికి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అందేలా పోస్ట్ ద్వారా గానీ, స్వయంగా గానీ అందించాలన్నారు. దరఖాస్తులు అం దించిన వారి చిరునామాకు పోస్టల్ బ్యాలెట్ మెటీరియల్ పోస్ట్ ద్వారా అందించటం జరుగుతుందని, ఓటు నమోదు చేసి పోస్టల్ బ్యాలెట్ కవర్లు మార్చి 2వ తేదీ నాటికి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరే విధంగా పోస్ట్ చేయాలన్నారు.

సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ పోలింగ్ పూర్తి అయిన తరువాత బ్యాలెట్ పేపర్ వినియోగానికి సంబంధించిన ఫారాలు, ఇతర ఫారాలు పూర్తి స్థాయిలో పోలింగ్ కేంద్రాల్లోనే పూర్తి చేసిన తరువాత మాత్రమే రిసెప్షన్ కేంద్రాలకు బయలుదేరి రావాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు నిర్దేశించిన విధంగా పోలింగ్ కేంద్రాలలో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ ప్రిసైడింగ్ అధికారికి అవసరమైన సహకారం అందించాలన్నారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులకు, మైక్రో అబ్జర్వర్లు నిర్వర్తించాల్సిన విధులు, బ్యాలెట్ బాక్సులు ఓటింగ్‌కు సిద్ధం చేసే విధానం, సీల్ వేసే విధానంపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వీడియో చిత్రాల ద్వారా శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లుగా విధులు కేటాయించిన అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ

గురజాలలో.. వైసీపీకి షాక్!

- టీడీపీలో చేరిన వైసీపీ చైర్మన్, కౌన్సిలర్లు
- వైస్ చైర్మన్‌గా భారతి ఎన్నిక

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పరిధిలోని పిడుగురాళ్లలో వైసీపీకి ఆ పార్టీ కౌన్సిలర్లు భారీ షాక్ ఇచ్చారు. సోమవారం 17 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక ఈ నెల 3, 4 తేదీలలో వాయిదా పడటం, తిరిగి ఈ నెల 17వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధమవుతున్న తరుణంలో ఊహించని విధంగా వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీతో తెగతెంపులు చేసుకొని (మిగతా 8వ పేజీలో)



ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు



ఇంటింటా సౌర వెలుగులు..!

- పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాఫ్‌ల ఏర్పాటు
- గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి సౌర కాంతులు
- లబ్దిదారులను గుర్తించే పనిలో యంత్రాంగం

8

చికెన్ @ 100

- కొనుగోళ్లపై బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

అంబటి సోదరులకు కార్పొరేషన్ అధికారులు దాసోహం

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపణ

6

ముంచుకొచ్చిన మృత్యువు




ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో, మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బుడంపాడు ప్రమాదంపై పెమ్మసాని విచారం

- మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకుంటామని భరోసా..
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు
- అధికారిక చర్యల నిమిత్తం కలెక్టర్‌కు సూచనలు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నారాకోడూరు రహదారిపై బుడంపాడు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురు మహిళా కూలీలు మృతి చెందడం పట్ల గ్రామీణాభివృద్ధిశాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విచారం వ్యక్తం చేశారు. భోపాల్ పర్యటనలో ఉన్న ఆయన దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే స్పందించిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అందజేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వీ రమణను ఫోన్‌లో ఆదేశించారు. మృతి చెందిన ముగ్గురు వ్యవసాయ కూలీల కుటుంబాలతో పాటుగా క్షతగాత్రులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఆ దిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మికి సూచించారు. అలాగే ప్రమాదం జరగడానికి గల కారణాలను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మృతులు అరుణ, సీతారాములు, నాంచారమ్మలకు తన సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురైన ఆటోలో పది మంది ప్రయాణిస్తున్నారని తెలుసుకొని విస్మయం వ్యక్తం చేశారు. పరిమితికి మించి ప్రజలను తీసుకెళ్తున్న ఆటోలు, ఇతర వాహనాలపై చర్యలు తీసుకోకుండా రవాణా శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని అధికారులకు మంత్రి పెమ్మసాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



ప్రమాదంలో మృతి చెందిన కూలీల మృతదేహాలు

పొన్నూరుటౌన్(చేబ్రోలు) ఫిబ్రవరి 17: చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ సమీపంలో జీబీసీ రహదారిపై గుంటూరు వెళుతున్న మహిళ కూలీల ఆటోను గుంటూరు వైపు నుంచి నారాకోడూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళ కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ ప్రమాద ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన మహిళ వ్యవసాయా కూలీలు ప్రతిరోజూ రాజధాని ప్రాంతంలోని నీరుకుండ గ్రామంలో మినుము పీకుడు పనులకు వెళుతున్నారు. రోజులాగేనే సోమవారం తెల్లవారుజామున బయలుదేరారు. పొగమంచు రోడ్డును కమ్మేసింది. ఆటో నారాకోడూరు గ్రామం దాటి గుంటూరు వైపు వస్తోంది. అదే సమయంలో గుంటూరు వైపు నుంచి తెనాలి వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేశాడు. ఆ సమయంలో పొగమంచు ఉండటం కారణంగా ఎదురుగా వస్తున్న ఆటోను బస్సు డ్రైవరు గమనించలేదు. దీంతో ఆటోను వేగంగా ఢీ కొట్టాడు. ఆటో ఉన్న కూలీలందరూ రోడ్డుపైనా, రోడ్డు పక్కనా చెల్లాచెదురుగా ఎగిరి పడ్డారు. ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కూలీలు అల్లంశెట్టి అరుణ(39), తోట సీతారాములు (41), కుర్రా నాంచారమ్మ (40)లు ఘటన స్థలంలోనే మృతి చెందారు. అదే సమయంలో ప్రయాణిస్తున్న వాహనదారులు, పలువురు రైతులు ఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. గాయాలపాలై రక్తమోడుతున్న మహిళ కూలీలను స్థానికులే రహదారిపై నుంచి పక్కకు చేర్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్‌ఐ వెంకట కృష్ణ గాయపడిన మహిళ కూలీలను 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మృతి చెందిన మహిళల మృతదేహాలను స్థానికుల సహాయంలో పంచానామా నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి పంపించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుంటూరు జీజీహెచ్‌లో ఎం శివమ్మ, ఎం శివపార్వతి, ఏ వెంకట రమణ, కే రత్నకుమారి, జీ మల్లేశ్వరి, కే ఆదిలక్ష్మి, ఆర్ సుబ్బమ్మ, ఏ కృష్ణకుమారి చికిత్స పొందుతున్నారు. మహిళ కూలీల మృత్యువాత పడిన సంఘటన గురించి తెలుసుకున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతులకు నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. సీఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ పలువురు విచారం వ్యక్తంచేశారు.

సుద్దపల్లిలో విషాధ ఛాయలు ..

సుద్దపల్లి గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం విషాద ఛాయలు నింపింది. ఒకే ప్రాంతానికి చెందిన మహిళలు ప్రతి రోజు దూరప్రాంతాలకు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుని కుటుంబాలను పోషిస్తున్నారు. అందరితో చేదోడువాదోడుగా ఉంటున్న మహిళలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పాటు 8 మంది మహిళలు గాయాలు పాలై ఆసుపత్రిలో చేరడంతో గ్రామస్థులు దుఃఖంలో మునిగిపోయారు.

మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు అండగా ఉంటాం ..

- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బుడంపాడు-నారాకోడూరు రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్రంగా కలిచి వేసిందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. గుంటూరు జీజీహెచ్‌లో ఆయన క్షతగాత్రులను కలిసి పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీకి, అలాగే మృతదేహాలకు పంచనామా త్వరితగతిన పూర్తిచేసి కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. ఈ ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర, పక్కన జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ కడియాల లలిత్ సాగర్, చిత్రంలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

డాక్టర్ లలిత్ సాగర్‌కు టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డు

- అందజేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

నరసరావుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టాప్5 కిడ్నీ సర్జన్‌గా నిలిచిన నరసరావుపేటకు చెందిన డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్ఠాత్మకంగా అందజేసే 'టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డు'కు ఎంపికయ్యాడు. ఈ మేరకు విశాఖపట్టణంలో జరిగిన 'టైమ్స్' మెగా కార్యక్రమంలో డాక్టర్ లలిత్ సాగర్ కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. పలువురు వైద్య ప్రముఖుల సమక్షంలో ఈ అవార్డును కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అందుకోవడం చాలా ఆనందంగా ఉందని డాక్టర్ కడియాల లలిత్ సాగర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఎన్డీయే కూటమి ప్రభుత్వం హయాంలోనే వైద్యులకు తగిన ప్రోత్సాహం కల్పించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి మంచి వాతావరణం ఏర్పడిందన్నారు. అత్యంత ఖరీదైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించాలనే తన లక్ష్యానికి సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లే స్ఫూర్తి అని అన్నారు. ఐకానిక్ లీడర్ హెల్త్ కేర్ పేరిట అత్యుత్తమ వైద్య సేవలందించిన వైద్యులకు టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతి ఏటా ప్రతిభావంతులను ఎంపికచేసి ఈఅవార్డులను అందజేస్తుంది. ఇందులో భాగంగా టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్- 2025ను కిడ్నీ (యూరాలజీ) సర్జన్ డాక్టర్ కడియాల లలిత్‌కు దక్కింది. కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత్ సతీమణి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, వారి కుమారులు కడియాల అక్షయ్‌నంద, అభయ్‌వర్ధన్ పాల్గొన్నారు.

అంబటి సోదరులకు కార్పొరేషన్ అధికారులు దాసోహం

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపణ

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని, అనుమతులు రద్దుచేసి ఆయా యాజమాన్యానికి కార్పొరేషన్ అధికారులు ఉత్తర్వులు జారీచేసినప్పటికీ వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా బహిరంగంగా గృహ ప్రవేశాలు చేయిస్తున్న గ్రీన్ గ్రేస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఏంటని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రశ్నించారు. గ్రీన్‌గ్రేస్ యాజమాన్యానికి దాసోహమయ్యారని ఆరోపించారు. ఈ విషయంపై సోమవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల విలేకరులతో మాట్లాడుతూ అంబటి మురళికి కార్పొరేషన్ అధికారులు ఎందుకు వంత పాడుతున్నారో చెప్పాలన్నారు. ఉన్నతస్థాయి కమిటీ వేసినప్పటికీ అక్రమ కట్టడాలపై ఏ చర్యలు తీసుకోకపోవడంపై అంతర్యం ఏమిటి కమిషనర్‌ను ప్రశ్నించారు. గ్రీన్‌గ్రేస్ యాజమాన్య అక్రమాలు, అవకతవకలను తాను నిరంతరం పోరాటం చేస్తున్నప్పటికీ కార్పొరేషన్ సిబ్బంది చూసిచూడనట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారో తెలియటం లేదన్నారు. కార్పొరేషన్ అధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు.

విద్యుత్ తీగ తగిలి కార్మికుడి మృతి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం తెనాలి పట్టణంలోని రజకపేటలో జరిగింది. కొల్లిపరకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు కేశన గోపి (34) రజకపేటలోని ఓ అపార్టుమెంట్ వద్ద పని చేస్తున్నాడు. ఈ క్రమంలో 3 అంతస్తుల భవనం వెలుపల వైపున పని చేస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ తీగలను గోపి తాకాడు. దీంతో షాక్‌కు గురై కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పదేళ్ల లోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2వ పట్టణ ఎస్‌ఐ బాబురావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం సోమవారం నాటికి 537.70 అడుగులు ఉంది. ఇది 183.56 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8718, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 16,078, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2000, ఎల్‌ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్ ఫ్లో 37,076 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థ' నాటిక



ఉత్తమ నటుడికి మెమెంటోను అందజేస్తున్న వెంకట్ నల్లపాటి

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి). మూడు రోజుల పాటు నిర్వహించిన రంగస్థలి 24వ జాతీయ ఆహ్వాన తెలుగు నాటిక పోటీలలో ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్, గుంటూరు వారి చిగురు మేఘం నాటిక నిలిచింది. ఉత్తమ నటుడిగా అన్నదాత నాటికలో అంకమ్మతాత పాత్రధారి చెంచు పున్నయ్య, ఉత్తమ నటిగా తితిక్ష నాటికలో భారతి పాత్రధారి ఎస్. జ్యోతిరాణి ఎంపికయ్యారు. ఉత్తమ రచన తితిక్ష , ఉత్తమ క్యారెక్టర్ నటుడు కావూరి సత్యనారాయణ (చిగురుమేఘంలో చిన్నయ పాత్రధారి) ఉత్తమ హాస్య నటుడు శేషయ్య (పక్కింటి మొగుడు నాటికలో సీతాపతి పాత్రధారి) ఉత్తమ విలన్ పవన్ కళ్యాణ్ (రాత నాటికలో అజయ్ పాత్రధారి) ఉత్తమ దర్శకత్వం ఎస్.రవీంద్రరెడ్డి (ఇంద్రప్రస్థం) ఉత్తమ మేకప్ ఉమా (తితిక్ష నాటిక), ఉత్తమ రంగాలంకరణ టి.బాబురావు (తితిక్ష నాటిక), ఉత్తమ సంగీతం కెవి.రమణ (పక్కింటి మొగుడు), ఉత్తమ బాల నటి సురభి వాగ్దేవి (రాత నాటిక) ఎంపికయ్యారు. ఉత్తమ జ్యూరీ బహుమతిని వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ 'రాత' నాటిక దక్కించుకుంది. న్యాయ నిర్ణేతలుగా నుసుము నాగభూషణం, మానాపురం సత్యనారాయణ, షేక్ బాజీ మస్తాన్‌లు వ్యవహరించారు.

విద్యుదాఘాతంతో బీహార్ కార్మికుడి మృతి



పవన్ మృతదేహం

వినుకొండటౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై బీహార్ కార్మికుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని కారంపూడి రోడ్డు వద్ద ఐటీసీ కార్యాలయం వెనుక నూతనంగా నిర్మిస్తున్న ఓ అపార్ట్‌మెంట్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం బెసాలి జిల్లా బిల్సర్ ఘాట్ గ్రామానికి చెందిన పవన్‌కుమార్ అపార్ట్‌మెంట్‌లో టైల్స్ పనులు చేసేందుకు తోటి స్నేహితులతో కలిసి నెల రోజుల క్రితం వినుకొండకు వచ్చారు. సోమవారం అపార్ట్‌మెంట్‌లో పని చేస్తుండగా పక్కను ఉన్న విద్యుత్ వైర్ తగిలి షాక్‌కి గురై అపస్మారకంగా పడిపోయాడు. గమనిం చిన తోటి మిత్రులు హుటాహుటిన ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే పవన్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం పవన్ మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య వినీత నిండు గర్భిణిగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101,109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00



మాట్లాడుతున్న ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఉత్తమ ఆహారపు అలవాట్లతో ఒత్తిడి దూరం

- ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఆహారపు అలవాట్లతో ఒత్తిడి దూరం అవుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు తెలిపారు. సోమవారం వర్సిటీ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ, ఫుడ్ సైన్స్ డైటెటిక్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఎదురుగావున్న ఉజ్వలహోంలో 'ఒత్తిడి ఉపశమనంపై పౌష్టిక ఆహార ప్రభావం' అంశంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.భవిత అధ్యక్షత వహించారు. ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ యువత ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటుపడి అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారని, చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హోమ్ నిర్వాహకులు సిస్టర్ రోజిలీనా సీఎస్ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మండూరు వెంకటరమణ, డాక్టర్ డి. జలజకుమారి, కౌన్సిలర్ ఎం. రూప, ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆచార్య వెంకటేశ్వర్లు

అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

పెదకాకాని, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాల పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం వర్సిటీ క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, టోర్నమెంట్ ప్రెసిడెంట్ ఆచార్య ఎ.ప్రమీలరాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. ప్రమీలారాణి మాట్లాడుతూ రెండ్రోజుల పాటు జరిగే ఈ పోటీలను ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పిపిఎస్. పాల్‌కుమార్ మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని 10 కళాశాలల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని, అందులో వర్సిటీ వ్యాయామవిద్య కళాశాల, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, ఏబీఆర్ డిగ్రీ కళాశాల, కందుకూరులోని శ్రీగుప్తా డిగ్రీ కళాశాలల జట్లు లీగ్ దశకు చేరుకున్నట్లు తెలిపారు. పోటీలకు నిర్వాహక కార్యదర్శిగా బి.అప్పలరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.బుచ్చిబాబు, వై.వేళాంగిణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య మధు మూర్తి

వినూత్న ఆలోచనే నూతన ఆవిష్కరణలకు పునాది

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి
- ఆర్వీఆర్‌జేసీలో ప్రారంభమైన ఐడీఈ బూట్ క్యాంపు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలే నూతన ఆవిష్కరణలకు పునాది అని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి అన్నారు. గుంటూరు రూరల్ మండలం, చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త సహకారంతో, వాధ్వాని ఫౌండేషన్ నేతృత్వంలో ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ బూట్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్. కె.మధుమూర్తి మాట్లాడుతూ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అన్నిరంగాల్లో ముఖ్యపాత్ర పోషిస్తున్నదన్నారు. ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె.గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలే పెట్టుబడులుగా మారి, నూతన స్టార్టప్‌లకు బీజం వేయాలని ఆకాంక్షించారు. అవేరా ఏ.ఐ మొబిలిటీ ఫౌండర్, సీఈవో డాక్టర్ ఎ.వెంకటరమణ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా స్టార్టప్‌లను నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఏఐసీటీఈ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఇంజనాగ భీమలింగేశ్వర్‌రెడ్డి, వాధ్వాని ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ సుప్రభా ఆర్ డాక్టర్. ద్రిష్ట డేజోయార్డర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్‌వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సెంటర్‌ను ప్రారంభిస్తున్న విద్యాసాగర్

విజ్ఞాన్స్‌లో డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

గుంటూరు (విద్య) ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి):చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో డ్రోన్ టెక్నాలజీ సెంటర్ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ అటానమస్ సిస్టమ్స్)ను ప్రారంభించామని వర్సిటీ వైస్‌ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, విజ్ఞాన్స్ యూనివర్సిటీల సంయుక్త ఆర్థిక సౌజన్యంతో ఈ డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డీ.విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ సెంటర్ వలన విద్యార్థులకు డ్రోన్ డిజైన్, వినియోగం, ప్రోగ్రామింగ్‌పై శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

1,43,296 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,63,393 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,43,296 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,321 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13600	334	--	--
నంబరు. 5	11000	14300	నంబరు. 5	--	--
273	10000	12300	273	--	--
341	10000	14000	341	--	--
4884	10000	12800	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14000	తేజ	--	--
బ్యాడిగి	10000	13500	బ్యాడిగి	--	--
దేవనూరు డీలక్స్	10000	13000	దేవనూరు డీలక్స్	--	--
తాలుకాయలు	4500	7000	ఏసీ తాలుకాయలు	--	--

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎస్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌పేట జీరో లైను, పొట్టిశ్రీరాములు నగర్ జీరో లైను నుంచి 7వ లైను వరకు, శ్రీనగర్ నాలుగు లైన్ల వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలానే శ్యామలా నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం స్తంభాలగరువు, పట్టాభిపురం, రవీంద్రనగర్, శ్రీనగర్, శ్యామలానగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

27న ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల దృష్ట్యా ఈ నెల 27వ తేదీన గ్రాడ్యుయేట్ ఓటు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ని ఎన్నికల సంఘం ప్రకటించింది. ప్రైవేటు మేనేజ్‌మెంట్‌లు, పరిశ్రమలు, ఇతర వాణిజ్య రంగాల్లో పని చేసే ఓటర్లకు ఆ రోజు ఓటుహక్కు వినియోగించుకొనే అవకాశాన్ని కల్పించాలని సంబంధిత యాజమాన్యాలను ఈసీ ఆదేశించింది. ఆఫీసులకు ఆలస్యంగా వచ్చినా అనుమతించాలని స్పష్టం చేసింది.

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి : జేసీ



కలెక్టరేట్‌లో సర్వే శాఖ సిబ్బందితో సమావేశమైన జేసీ భార్గవ తేజ

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల రీసర్వేని పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టరు భార్గవ్ తేజ ఆదేశించారు. సోమవారం ఆయన రీ సర్వే పైలెట్ ప్రాజెక్ట్ కింద గుంటూరు తూర్పు మండలం జొన్నలగడ్డలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం రీ సర్వే బ్లాక్ బౌండరీ సరిహద్దును పరిశీలించారు. గ్రౌండ్ ట్రూతింగ్ కార్యక్రమానికి హాజరైన రైతులతో మాట్లాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామపటం, వోఆర్ఐ షీట్లను పరిశీలించారు. జొన్నలగడ్డ గ్రామ సచివాలయాన్ని సందర్శించి అక్కడ రీసర్వే కార్యక్రమంలో భాగమైన వెక్టరైజేషన్‌ను క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో పరిశీలించారు. పీజీ ఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఎలా పరిష్కరిస్తున్నారో అని పరిశీలించారు. పరిష్కార విధానం, అర్జీదారుడు సంతృప్తి చెందేవిధంగా ఉండాలని జేసీ సంబంధిత అధికారులను ఆదేశించారు. తదుపరి సంబంధిత గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులకు రీసర్వే మీద సూచనలు చేశారు. సర్వే ప్రక్రియ త్వరగా పూర్తయ్యేటట్లుగా ప్రణాళికాబద్ధంగా చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు, సర్వే సహాయ సంచాలకుడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్, మండల సర్వేయరు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఫలితాల కోసం కృషి

● టీఎస్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ జగదీష్‌కుమార్

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో మెరుగైన ఫలితాల కోసం సహకరిస్తామని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌యూఎస్) రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ జగదీష్‌కుమార్ అన్నారు. సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ డీఈవో ఏసురత్నంను సంఘం నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో పాలేటి జగదీష్‌బాబు, శ్రీనివాసరెడ్డి, అంతోనిబాబు, షేక్ షరీఫ్, బాలాజీనాయక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయి మందిర వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట శ్రీగణేశ్వరరావు వీధిలో కొలువున్న షిరిడి సాయిబాబా ధ్యాన మందిరం 12వ వార్షిక వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన పూజారి చైతన్యకు మార్‌శర్మ, అర్చకులు శివగోపాలాచారి ఆధ్వర్యంలో బాబాకి కాకడ హారతి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి అలంకరణ భక్తులతో సాయి సత్యవ్రతాలు చేశారు. అనంతరం వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

వైభవంగా రథోత్సవం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీశృంగేరి శంకర మఠం, శ్రీశారదా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి 59వ ప్రతిష్ఠ వారిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగం గా లక్ష కుంకుమార్చన, దుర్గా సూక్తులతో మహాభిషేకం, చండీ హోమం, పూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ శారదా పరమేశ్వరి అమ్మవారి నగర రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీర్వచనాలు పొందారు. ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి



పదో తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలను విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతవరణంలో, సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లా అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. జిల్లాలో 470 పాఠశాలలకు సంబంధించి రెగ్యులర్ విద్యార్థులు 29,499 మంది, ప్రైవేటుగా 961 మంది కలిపి మొత్తం 30,460 మంది విద్యార్థులు 150 కేంద్రాల్లో పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి, సమీప ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లు మూసి వేయించాలని, పోలీస్‌శాఖతో అవసరమైన బందోబస్తు ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పారిశుధ్యం పనులు, మంచినీటి ఏర్పాటుకు మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల అవసరం మేరకు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డ్వామా పీడీ శంకర్, డీఈవో రేణుక, డీఎంహెచ్‌వో డా.విజయలక్ష్మి, ఎస్పీ సీఐ శ్రీనివాసరావు, ఎంవీఐ గోపాల్, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, సీపీడీసీఎల్ డీఈ ప్రసాద్, జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటరెడ్డి, గుంటూరు పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ రవిశేఖర్, తెనాలి అసిస్టెంట్ సూపరింటెండెంట్ పాంచజన్య రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజరు డి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అతిథి గృహాలకు స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్

పర్యాటక రంగం అభివృద్ధి కోసం అతిథి గృహాల్లో సురక్షితమైన పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చేందుకు ప్రవేశ పెట్టిన స్వచ్ఛత గ్రీన్‌లీఫ్ రేటింగ్ విధానాన్ని నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ విధానం (ఎస్‌జీఎల్‌ఆర్ఎస్) జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హాతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తాగునీరు, పారిశుధ్యం శాఖ, టూరిజం మంత్రిత్వ శాఖ సంయుక్తంగా అతిథి గృహాలకు స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ విధానంను ప్రవేశపెట్టారన్నారు. పర్యాటక రంగంలో ఆతిథ్యానికి సంబంధించి హోటల్స్, లాడ్జీలు, హోమ్ స్టేలు, ప్రార్థనాలయాలకు సంబంధించిన సత్రాల్లో పారిశుధ్య నిర్వహణ ప్రమాణాలకు అనుగుణంగా ఎస్‌జీఎల్‌ఆర్ఎస్ రేటింగ్‌ను కేటాయిస్తారన్నారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ మెంబరు కన్వీనర్‌గా, జడ్పీ సీఈవో, ఎంపీడీవోలు, జిల్లా టూరిజంశాఖ అధికారి సభ్యులుగా కమిటీ ఉంటుందన్నారు. డివిజన్ స్థాయిలో రెవెన్యూ డివిజన్ అధికారి, సబ్‌కలెక్టర్ ఛైర్మన్‌గా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మెంబరు కన్వీనర్, డీఎల్డీవోలు, ఎంపీడీవోలు సభ్యులుగా కమిటీ ఉంటుందన్నారు. జిల్లా, డివిజన్ స్థాయి కమిటీల్లో మున్సిపల్ కమిషనర్లను స భ్యులుగా చేర్చుతామన్నారు. ఈ సమావేశంలో ఆర్ డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కళ్యాణ చక్రవర్తి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా టూరిజం అధికారి శ్రీరమ్య, హోటల్స్ అసోసియేషన్ సభ్యుడు బాలసుబ్రహ్మణ్యం, పంచాయతీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నిలిపివేత ఉత్తర్వుల ఉల్లఘంనపై చట్టపరమైన చర్యలు

● విచారణకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసాం
● విలేకరుల సమావేశంలో కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో ప్రసంగిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరంలోని గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణ పనుల నిలిపివేత ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ తదుపరి నిర్మాణ పనులు కొనసాగించారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారుల పర్యవేక్షణ లోపం తదితర అంశాలపై అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి అధికారుల కమిటీ ఏర్పాటు చేశామని, సదరు అపార్టుమెంట్‌కు పూర్తిస్థాయి అధికారిక అనుమతులు లేవని, కమిటీ నివేదిక మేరకు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్‌ను సదరు యాజమాన్యం నగరపాలక సంస్థ నుంచి చట్టబద్ధత, నిర్దేశిత అనుమతులు లేకుండా కేవలం డీమ్డ్ ప్లాన్‌తో నిర్మాణ పనులు చేట్టిందని అన్నారు. కమిషనర్‌గా తాను బాధ్యతలు చేపట్టిన అనంతరం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్న డాక్యుమెంట్స్‌ను పరిశీలించిన తరువాత ప్రభుత్వానికి అపార్టుమెంట్ అనుమతుల్లో 19 మంది అధికారుల పాత్రపై సమగ్ర నివేదిక పంపామన్నారు. గతే ఏడాది ఆగస్టు 21న తాము సదరు అపార్టుమెంట్ నిర్మాణ పనులను, పరిసరాలను సమగ్రంగా పరిశీలించి అప్పటి వరకు పలు దఫాలుగా నగరపాలక సంస్థ ఇచ్చిన షార్ట్ ఫాల్స్ నోటీసులను, రైల్వే, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫైర్ డిపార్టుమెంటుల ఎన్‌వోసీలను పరిశీలించి తక్షణం నిర్మాణ పనుల ఆపాలని నోటీసులను జారీ చేశామన్నారు. 2023లోనే రైల్వేశాఖ గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్‌కు తాము జారీ చేసిన ఎన్‌వోసీని రద్దు చేసిందని, ఆ డాక్యుమెంట్‌లను నాటి పట్టణ ప్రణాళిక ఉన్నతాధికారులకు ఇవ్వలేదన్నారు. అనంతరం పట్టణ ప్రణాళిక అధికారులను పనులు జరుగకుండా పర్యవేక్షించాలని ఆదేశించామని, అయినప్పటికీ పనులు జరుగుతున్నట్లు పలు ఆరోపణలు వచ్చాయన్నారు. ఆదివారం సదరు అపార్టుమెంట్‌లో ఒక ఫ్లాట్ యజమాని గృహప్రవేశం కూడా చేశారని మీడియా ముఖంగా తెలియగానే అదనపు కమిషనర్ ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక, డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారుల బృందం ఇచ్చిన నివేదికను పరిశీలించి బాధ్యులైన అధికారులు అపార్టుమెంట్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటి కమిషనర్ సీహెచ్ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాం బాబు, డీసీపీ సూరజ్, ఈఈ కోటేశ్వరరావు, ఎస్ఎస్ సోమశేఖర్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నలుగురి అరెస్టు.. 22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నిందితులతో ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ సుప్రజ తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్ప డుతున్న నలుగురిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 22 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పలకలూరు రోడ్డులోని రత్నగిరి నగర్‌కి చెందిన వెలివోలు వెంకటేష్, ముప్పాళ్ళ మండలం లంకెల కూరపాడుకు చెందిన మోరంరెడ్డి సీతారెడ్డి, సంగంజాగర్లమూడికి చెందిన మహమ్మద్ రషీద్, చంద్ర రాజేశ్వరరావు కాలనీకి చెందిన చల్లా గోపి అనే నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ సతీష్ కుమార్, సీసీఎస్ అదనపు ఎస్పీ కే సుప్రజ తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరు పరిచి వివరాలు వెల్లడించారు.

ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న నలుగురు నిందితులు అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు. సీసీఎస్ అదనపు ఎస్పీ కే సుప్రజ పర్యవేక్షణలో డీఎస్పీ శివాజీరాజు ఆధ్వర్యంలో నల్లపాడు సీఐ కే వంశీధర్, సీసీఎస్ సీఐలు మహమ్మద్ అల్తాఫ్ హుస్సేన్, బత్తుల శ్రీనివాస రావు, జే అనురాధ చేబ్రోలు ఎస్ఐ డీ వెంకటకృష్ణ, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ళు, హోంగార్డులను అభినందించారు.

21న కుంభమేళాకు ఆర్టీసీ స్పెషల్ బస్సు

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళాకు ఈనెల 21న ఆర్టీసీ మరో స్పెషల్ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. 21న గుంటూరు బస్టాండ్‌లో ఉదయం 10 గంటలకు బస్సు బయల్దేరుతుందన్నారు. మొత్తం 8 రోజుల్లో తొలిరోజు గుంటూరు నుంచి బయల్దేరి రెండో రోజు సాయంత్రానికి కుంభమేళా ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటుందన్నారు. మూడో రోజు మొత్తం ప్రయాగరాజ్‌లో బస చేసి పుణ్య స్నానాలు ఆచరించి, 4వ రోజు రాత్రికి అయోధ్య చేరేందుకు బయల్దేరుతుందన్నారు. 5వ రోజు ఉదయం అయోధ్య చేరుకొని, బాలరాముని దర్శించుకొని, సాయంత్రానికి వారణాసి బయల్దేరుతుందని తెలిపారు. ఆరో రోజు ఉదయం వారణాసి చేరుకొని, ఆ రోజు అక్కడే బస చేసి ఏడో రోజు ఉదయం వారణాసి నుంచి బయలుదేరి ఎనిమిదో రోజు రాత్రికి గుంటూరు చేరుకుంటుందన్నారు. ఈ సర్వీస్‌కు 91927 ఆన్‌లైన్ సర్వీస్ నంబర్ ద్వారా రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కూడా ఉందని డీఎం తెలిపారు. ఈ సదవకాశంను గుంటూరు, పరిసర ప్రాంత ప్రయాణికులు సద్వినియోగించుకోవాలన్నారు. టికెట్ ధర రూ.8300 మాత్రమేనని తెలిపారు. వివరాలకు 7382897459, 7382896403 సంప్రదించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● వర్సిటీ వీసీ కే గంగాధర్



పర్యావరణ పరిరక్షణపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధర్ తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం మేధావులు, విద్యావంతులు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వర్తించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ కే గంగాధర్ సూచించారు. సోమవారం హిందూ కళాశాల వృక్షశాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 'ఆరోగ్యకరమైన వాతావరణం కోసం సుస్థిరాభివృద్ధి ఎలా జరగాలి' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మా ట్లాడారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, ఇందుకు విస్తృత ప్రచారం అసరమని ఆచార్య గంగాధర్ సూచించారు. సెంట్రల్ వర్సిటీ విశ్రాంత అధ్యాపకులు ఎంఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధికి పర్యావరణం ఎంతో కీలకమన్నారు. వర్సిటీ పర్యావరణ విభాగాధిపతి ఏవీవీఎస్ స్వామి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే జీవ వైవిధ్యం సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ జర్వముల హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ రఘు, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజనీరు మహమ్మద్ నజీనాబేగం, సెమినార్ కన్వీనర్ డాక్టర్ ఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ మైండ్స్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మాస్టర్ మైండ్స్ విద్యార్థులు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన సీఎంఏ ఇంటర్ సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన సందర్భంగా మాస్టర్ మైండ్స్ ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సీఎంఏ ఫైనల్లో 2, 4, 5 ర్యాంకులు, సీఎంఏ ఇంటర్లో 4, 10 ర్యాంకులు తమ విద్యార్థు లు సాధించారని అడ్మిన్ అడ్వైజర్ మట్టిపల్లి మోహన్ తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ మైండ్స్ ప్రతినిధులు వై శ్రీనివాసరావు, ఆంజనేయులు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులను నిర్లక్ష్యం చేసిన కేంద్ర బడ్జెట్

● వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులను పూర్తిగా నిర్ల క్ష్యం చేసిందని వామపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ కు వ్యతిరేకంగా సోమవారం శంకర్‌విలాస్ సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో దోపిడీ వర్గాలకు నజరానాలు ప్రకటించిన మోదీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను విస్మరించడం దారుణమన్నారు. బడా పారిశ్రామికవేత్తల కనుసన్నల్లో నడుస్తున్న మోదీ ప్రభుత్వం నాటి నుంచి నేటి వరకు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పేద ప్రజల గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. నిరసనల్లో రావుల అంజిబాబు, ఎం సూర్యారావు, కే నళినికాంత్, ఎస్ విష్ణు, ఈమని అప్పారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అంతర్గత బదిలీలను నిలిపివేయాలి

● యూనియన్ నాయకుల డిమాండ్



జీఎంసీ ఎదుట కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న యూనియన్ నాయ కులు మాల్యాద్రి, రవికుమార్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధి లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల అంతర్గత బదిలీలను తక్షణమే నిలిపివే యాలని పలు యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ ఎదుట కార్మికులతో ప్రత్యేక సమావేశాన్ని నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కోట మాల్యాద్రి, వరి కళ్ళ రవికుమార్‌లు మాట్లాడుతూ గతంలో ఏ కమిషనర్ చేయనటువంటి అం తర్గత బదిలీలను ప్రస్తుత కమిషనర్ పులి శ్రీనివాసులు చేపట్టారని, ఇది కార్మికులకు చాలా ఇబ్బందిగా ఉంటుందన్నారు. దూరప్రాంతాలకు వెళ్లి కార్మికులు పని చేయాలంటే బోలెడంత ఖర్చులు ఉన్నాయన్నారు. రవాణా చార్జీలు అధికమవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్నట్లుగానే కార్మికులను ఎక్కడికి బదిలీ చేయొద్దని యూనియన్ నాయకులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

నెల్లూరు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీపై కేసు

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ వీర్నపు కిరణ్‌పై నగరంలోని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తన భర్త వివాహేతర సంబంధాలు పెట్టుకుని వేధిస్తున్నాడని భార్య తాళ్లూరి అనూష రాణి వాపోయింది. ఈ క్రమంలో పది నెలల క్రితం ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద మనుషులుగా వచ్చి తమ మధ్య ఒప్పందం కుదిర్చారన్నారు. పిల్లలు తనతోనే ఉంటారని, తనకు కుటుంబ పోషణ నిమిత్తం కొంత మొత్తం ఇవ్వాలని చెప్పారన్నారు. దీంతో పోస్టల్ కాలనీలో ఇద్దరం పక్కపక్కనే ఉంటున్నామన్నారు. అయితే గత శనివారం తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు తన కుమారుడని తీసుకొని వెళ్లానని, రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చామనే అనే కారణంతో ఆదివారం భర్త కిరణ్ తన కుమారుడిని కొడుతుండగా తాను అడ్డువెళ్లగా తనను కూడా విచక్షణా రహితంగా కొట్టాడన్నారు. దీంతో అనూషరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఆరండల్‌పేట పోలీసులు తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

● 2.40 లక్షల ఖరీదైన 24 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో నిందితులు మణికంఠ, చింతల పద్మ

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా విక్రయం కేసుల్లో శివారెడ్డి పాలెంకు చెందిన దమ్మాలపాటి మణికంఠ అదే విధంగా విశాఖ జిల్లా జి.మాడుగుల మండలం పెద్ద కిల్తారి గ్రామానికి చెందిన చింతల పద్మ అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 2.4 లక్షల ఖరీదైన 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శివారెడ్డిపాలెంకు చెందిన దమ్మాలపాటి మణికంఠ ఏడో తరగతి వరకు చదువుకొని ఆ తర్వాత చెడు అలవాటులకు గురై చదువు మానేసి బేల్దారి పనులు చేసుకుంటూ తన తండ్రి ట్రాక్టర్ డ్రైవర్‌గా ఉంటుండగా ఆయనతో కలిసి పని చేసేవాడు. చెడు అలవాట్లకు ఆకర్షితుడైన మణికంఠ గంజాయి దొరికే ప్రాంతాలను విచారిస్తుండగా జిమాడుగుల మండలంలోని పెద్ద కెల్తారుకు చెందిన చింతల సత్యనారాయణ అలియాస్ సతీష్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఆయన ద్వారా రెండు కిలోల గంజాయి రూ.పదివేలకు కొనుగోలు చేశాడు. ఆ విధంగా సత్యనారాయణతో పరిచయం ఏర్పడడంతో బస్సులో వెళ్లి గంజాయి తీసుకొని రైల్లో గుంటూరు వచ్చేవాడు. 50 గ్రాముల ప్యాకెట్‌ను రూ.500లకు విక్రయిస్తుండేవాడు ఈ విధంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ప్రతిసారి గంజాయి తెప్పించి విక్రయిస్తున్నాడు. కాగా ఈ దఫా పెద్ద మొత్తంలో గంజాయి కావాలని చెప్పడంతో సత్యనారాయణ అలియాస్ సతీష్ తన భార్య పద్మతో 24 కిలోల గంజాయి ఇచ్చి పంపించాడు. పక్కా సమాచారంతో వారిని అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు. ఈ మేరకు సీసీఎస్ అదనపు ఎస్పీ కే సుప్రజ పర్యవేక్షణలో డీఎస్పి శివాజీరాజు ఆధ్వర్యంలో నల్లపాడు సీఐ కే వంశీధర్, సీసీఎస్ సీఐలు మహమ్మద్ అల్తాఫ్ హుస్సేన్, బత్తుల శ్రీనివాస రావు, జే అనురాధ చేబ్రోలు ఎస్ఐ డీ వెంకటకృష్ణ, ఏఎస్ఐలు పీఎస్ రామకృష్ణ, డీ కృష్ణస్వామి, హెడ్‌కానిస్టేబుళ్ళు, హోంగార్డులను అభినందించారు.

చిరువ్యాపారులను ఆదుకుంటున్న 'ఖిద్మత్' సొసైటీ

రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎండీ షరీఫ్, ఎమ్మెల్యే నసీర్



ఖిద్మత్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న షరీఫ్, నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వడ్డీ రహిత రుణాలను అందజేసి చిరు వ్యాపారులు, చేతివృత్తులవారిని ఆదుకుంటున్న 'ఖిద్మత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ' సేవలు అభినందనీయమని రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎండీ అహ్మద్ షరీఫ్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన సొసైటీ కార్యాలయాన్ని సోమవారం వారిద్దరూ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీ సేవలను చిరువ్యాపారులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, చేతి వృత్తులు చేసుకునే మహిళలు, తోపుడు బళ్లవారు వినియోగించుకోవాలని, వడ్డీలేని రుణాలతో వ్యాపారాన్ని వృద్ధిలోకి తెచ్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో షౌకత్ ఫహీం సాహెబ్, కరీముద్దీన్ సాహెబ్, ఎండీ జాహెద్, బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

● ఆలపాటిని గెలిపిద్దాం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని గెలిపించి సీఎం చంద్రబాబుకు గిఫ్టుగా అందిద్దామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, నాయకులతో సోమవారం ఆయన సమావేశమయ్యార ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● అర్బన్ సీడీపీవోకు వినతిపత్రం అందజేత

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్‌వాడీ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమయ్యనగర్‌లోని అర్బన్ సీడీపీవో కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం దీప్తి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్‌వాడీలు 42 రోజులు పాటు సమ్మె చేసిన సందర్భంగా ఇచ్చిన హామీలను జీవో రూపంలో విడుదల చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కే శ్రీనివాసరావు, చిన వెంకాయమ్మ, పద్మ, బాజీబీ, కృష్ణకుమారి, ప్రసన్న, సంకీర్తి, జానీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా.. సౌర వెలుగులు!



కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి విద్యుత్ రంగంలో సంస్కరణలపై పెద్దఎత్తున దృష్టిపెట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఇంటికప్పుపై సౌర విద్యుత్ ఉత్పత్తిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను ముమ్మరం చేసింది. దశల వారీగా పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఉన్న అన్ని ఇళ్లకు సౌర కాంతులు అందేటట్లు ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వం ముందుకెళుతోంది. కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకం దన్నుగా దీనిని పూర్తిస్థాయిలో అమలు చేయడానికి యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల రూఫ్‌టాఫ్ సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఉచితంగా అందివ్వడానికి మార్గదర్శకాలను ప్రభుత్వం గతంలోనే విడుదల చేసింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ వివరాలను సేకరించిన యంత్రాంగం ఆ జాబితాను ప్రభుత్వానికి పంపింది. మిగిలిన వారికి రాయితీపై ఈ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించి త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదల వడంతో పాటు లబ్ధిదారులకు సౌరవిద్యుత్ ఫలాలు అందించే విధంగా కూటమి ప్రభుత్వం అడుగు లేస్తోంది

● పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాఫ్‌ల ఏర్పాటు

● గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ సౌర కాంతులు

● లబ్ధిదారులను గుర్తించే పనిలో యంత్రాంగం ● ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా యూనిట్లు ● తొలి విడతలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5 లక్షల కుటుంబాలకు లబ్ధి ● ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సౌర విద్యుత్‌కే మొగ్గు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాప్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు యూనిట్‌కు అయ్యే వ్యయంతో పాటు దాని ద్వారా తక్కువ ఖర్చుతో విద్యుత్ ఎలా పొందవచ్చో అనే దానిపై ఇప్పటికే పెద్దఎత్తున ప్రజలకు అవగాహన కల్పించడంతో దరఖాస్తులు భారీగానే వచ్చాయి. వాటి ఆధారంగా లబ్ధిదారుల జాబితాను తయారు చేసే పనిలో యంత్రాంగం నిమగ్న మయింది. పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందించే 2 కిలో వాట్ల రూఫ్‌టాఫ్ సౌర విద్యుత్ యూనిట్ వ్యయం రూ.1.80 లక్షలుగా ఉంది. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే రాయితీ రూపంలో భరించ నున్నాయి. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం భరించేది 40 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పై కప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలో వాట్ సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అయ్యే ఖర్చులో 40 నుంచి 60 శాతం వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాయితీలు అందిస్తున్నాయి

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా....

సోలార్ రూఫ్‌టాప్‌లను పీఎం సూర్యఘర్ పథకం కింద అమర్చుకోవడానికి ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను గతంలోనే ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ ప్రక్రియ చేపట్టారు. వీటి ఆధారంగా సంబంధిత సర్వీస్ కనెక్షన్ నెంబరు, మొబైల్ నంబరు యాప్‌లో నమోదు చేయగానే వినియోగదారుడికి వచ్చే ఓటీపీ ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది

చార్జీల భారం తగ్గించడమే లక్ష్యంగా...

ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యుత్ విభాగాన్ని తిరోగమన బాట పట్టించడమే కాకుండా వినియోగదారులను కరెంటు చార్జీల రూపంలోఎడాపెడా బాదేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో సోలార్ విద్యుత్‌ను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని అడుగులేస్తుండడం, అందుకు సంబంధించిన కార్యాచరణ కూడా పీఎం సూర్య ఘర్ పథకం రూపంలో వేగం అందుకోవడంతో త్వరలోనే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చాలా ఇళ్లు సౌర కాంతులు వెదజల్లనున్నాయి

వినియోగాన్ని బట్టి....

ఇళ్లల్లో వాడే విద్యుత్ వినియోగం ఆధారంగానే ఎంత కిలోవాట్‌ల రూఫ్‌టాప్‌లు అవసరం అవుతాయనే విషయంలో లబ్ధిదారులు అంచనాకు రావాల్సి ఉంది. నెలకు ప్రస్తుతం 150 యూనిట్లకు దిగువనే కరెంటు వాడేవారు ఒక కిలో వాట్, 150 నుంచి 300 యూనిట్ల మధ్యలో వారైతే రెండు కిలోవాట్స్, 300 యూనిట్ల కంటే అదనంగా వినియోగించే వారు మూడు కిలోవాట్స్ సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్లను అమర్చుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి విడతలో దాదాపు 5 లక్షల కుటుంబాలు ఈ పథకం కింద లబ్ధి పొందుతుండగా దాదాపు 65 శాతం మంది వినియోగదారులు రెండు కిలోవాట్స్ కేటగిరీలోనే ఉండడం గమనార్హం.

ప్రభుత్వ కార్యాలయాల్లోనూ...

గత ప్రభుత్వ నిర్వాకంతో వివిధ ఆఫీసులకు సంబంధించి లక్షల్లో కరెంటు బిల్లులు పేరుకుపోయాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఒక్క ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలే దాదాపు రూ.2.50 కోట్లుగా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ఎక్కువగా రెవెన్యూ విభాగానివే ఉండడం గమనార్హం. ఇక గ్రామ పంచాయతీల పరిధిలో బకాయిలు ఉన్న కరెంటు బిల్లులు అయితే కొండలా పేరుకుపోయాయి. వీటిని చెల్లించడమే ప్రస్తుత ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాల్‌గా తయారయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం సౌర విద్యుత్ వాడకాన్ని పెంచడం వల్ల ఖజానాపై భారం తగ్గుతుందనేది పాలకుల ఆలోచనగా ఉంది. ప్రభుత్వ ఆధీనంలో నడిచే కార్యాలయాలు, సంస్థల కోసం కేంద్రం ప్రత్యేకంగా రెస్కో నమూనాను తీసుకొచ్చింది. ఈ విధానంలో భాగంగా వాటా సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేకుండా ఏర్పాటు, నిర్వహణ అంతా ఉచితంగానే కేంద్రమే సమకూరుస్తుంది. కాకపోతే తర్వాత సౌర విద్యుత్ వాడకానికి యూనిట్‌కు రూ.4 చెల్లించడమే రెస్కో విధానంగా ఉంది. ఇలా 25 ఏళ్ల పాటు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంటారు. దీనివల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో కరెంటు బిల్లుల్లో సైతం రూ.కోట్లలో సొమ్ము ఆదా అయ్యే అవకాశం ఉంటుంది.

మధ్యతరగతి, పేదలకే ఎక్కువ లబ్ధి..

సూర్యఘర్ పథకం కింద సోలార్ లబ్ధిదారుల ఎంపికను ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో దృష్టి సారించడంతో పాటు, ఎస్సీ, ఎస్టీలకు ప్రతి ఒక్కరికీ ఈ ఫలాలు అందేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ముఖ్యంగా కరెంటు వినియోగానికి గతంతో పోలిస్తే అయ్యే ఖర్చును సౌర విద్యుత్ రూపంలో తక్కువగా అయ్యేటట్లు చూడడంతో పాటు మిగులు విద్యుత్‌ను ఉత్పత్తి చేసే విధంగా గ్రామాలను తయారు చేసే విధంగా ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకెళుతోంది. దశల వారీగా సోలార్ కాంతులను పంచే ఇళ్లను పెంచడంతో పాటు మరింత మందికి ఈ పథకం గురించి అవగాహన కల్పించి మధ్యతరగతి, పేద వర్గాలకు న్యాయం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది

చికెన్ @ 100



● చికెన్ కొనుగోళ్లపై బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్
● గణనీయంగా పడిపోయిన అమ్మకాలు
● ధరలు తగ్గించిన కొందరు వ్యాపారులు

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ వ్యాపారానికి గడ్డుకాలం ఏర్పడింది. బర్డ్ ఫ్లూ ప్రచారంతో చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు జంకుతుండటంతో కొనుగోళ్ళు గణనీయంగా పడిపోయాయి. మరో వైపు చికెన్ ధర కూడా రూ.100లకు దిగజారిపోయింది. చికెన్ కిలో రూ. స్కిన్‌రూ.90, స్కిన్ లెస్ రూ.100లకు విక్రయిస్తున్నారు. గుంటూరులోని జీటీ రోడ్డు, నగరంపాలెం, నల్లచెరువు వంటి కొన్ని ప్రాంతాల్లో ధరలు తగ్గిస్తూ కిలో రూ. 100 అంటూ కొందరు వ్యాపారులు స్టాల్స్‌లో బోర్డులు ఏర్పాటు చేశారు. గత నెలలో చికెన్ కిలో గరిష్ఠంగా రూ. 270 వరకు విక్రయించారు. ఆ తరువాత కిలో రూ. 250లకు అమ్మకాలు జరిపారు. ఈనెల ప్రారంభంలోనే తెలంగాణలో బర్డ్ ఫ్లూ ప్రచారం పెద్దఎత్తున జరగటం, అక్కడ ప్రభుత్వం అధికారికంగానే చికెన్ విక్రయాలను కొన్ని జిలాల్లో నిషేధించిన విషయం తెలిసిందే. ఈ ప్రచారంతో ప్రజల్లో కొంత భయాందోళన నెలకొన్నది. అయితే జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం లేదని అధికార యంత్రాంగం చెప్పినప్పటికీ ప్రజల్లో ఆందోళన తగ్గటం లేదు. రెండు వారాలుగా చికెన్ కొనుగోళ్ళపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సాధారణంగా జిల్లా కేంద్రం గుంటూరు నగరంలో స్టాల్స్‌లో చికెన్ విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. ఇక ఆదివారం వచ్చిందంటే సాధారణ రోజుల కంటే రెట్టింపు విక్రయాలు జరుగుతాయి. ఒక్క ఆదివారం రోజునే చికెన్ స్టాల్స్‌లో రెండున్నర లక్షల కోళ్ళు అమ్ముడుపోతుంటాయని వ్యాపారులు తెలిపారు. అయితే బర్డ్ ఫ్లూ ప్రభావంతో విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. తాజాగా మొన్నటి ఆదివారం నగరంలో కేవలం సాదాసీదాగా 70వేల లోపు మాత్రమే కోళ్ళ విక్రయాలు జరిగాయని పౌల్ట్రీ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కొనుగోళ్ళు పడిపోవటంతో కొందరు చికెన్ స్టాల్స్ వ్యాపారులు ధరలు తగ్గించేందుకు నిర్ణయించారు. చికెన్‌స్కిన్‌లెస్ కిలో రూ.100లకు విక్రయించాలని మూకుమ్మడిగా నిర్ణయించుకు న్నారు. దాంతో ఆయా స్టాల్స్‌లో ధరల బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇక మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం కిలో రూ. 160లకు విక్రయాలు జరుపుతున్నారు.



గుంటూరు : కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న చికెన్ స్టాల్

కోలుకోలేని దెబ్బే.....

బర్డ్ ఫ్లూ ప్రభావంతో చికెన్ స్టాల్స్ అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. దాంతో చికెన్ స్టాల్స్ కొనుగోళ్ళు వెలవెలబోతున్నాయి. రెండు వారాలుగా ఇదే పరిస్థితి నెలకొంటున్నదని, కనీసం స్టాల్స్ నిర్వహణ, కూలీల ఖర్చు కూడా వచ్చే పరిస్థితులు లేవని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఇది పౌల్ట్రీ వ్యాపారానికి కోలుకోలేని దెబ్బగా చెబుతున్నారు. మరి కొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నదని వ్యాపారులు అభిప్రాయ పడుతున్నారు.

పీఎంశ్రీ పథకంతో

తీరనున్న ల్యాబ్‌ల కొరత

201 పాఠశాలలకు రూ.31.31 కోట్లు మంజూరు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రధాన మంత్రి స్కూల్ రైజింగ్ ఇండియా పథకం ల్యాబ్‌ల కొరత తీరుస్తుంది. ఈ పథకం కింద రాష్ట్రంలో 201 పాఠశాలలకు రూ.31.31 కోట్లు మంజూరు చేశారు. ఒక్కో ల్యాబ్ నిర్మాణానికి రూ.15.58 లక్షలు కేటాయించారు. తొలి విడతలో రూ.22.50 కోట్లు మంజూరు చేయగా ల్యాబ్‌ల నిర్మాణం తుది దశకు చేరుకుంది. చివరి దశ పనులకు మరో రూ.4.54 కోట్లు నిధులు మంజూరు చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయుల పీపీఏ ఖాతాలకు నిధులు విడుదల చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో తుళ్లూరు, రేవేంద్రపాడు, కొల్లిపర, అంగలకుదురు, ప్రత్తిపాడు, బాపట్ల జిల్లాలో ఉల్లిపాలెం, నాగులపాలెం, యాజలి, అమృతలూరు, కొప్పెర ఉన్నత పాఠశాలల్లో ల్యాబ్‌లు నిర్మిస్తున్నారు. ల్యాబ్‌ల కొరత ఉండి స్థలంతో పాటు అధిక విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలను తొలి దశలో ఎంపిక చేసి ల్యాబ్‌లు మంజూరు చేశారు. ఈ పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా మార్చడంతో ఇంటర్ తరగతులు కూడా గత విద్యా సంవత్సరం నుంచి జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రయోగాలు ప్రత్యక్షంగా చేసే పరిజ్ఞానం చేకూరనుంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తిస్థాయిలో ఈ ల్యాబ్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు సమగ్ర శిక్షా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



తుది మెరుగులు దిద్దుకుంటున్న కెమిస్ట్రీ ల్యాబ్

గురజాలలో.. వైసీపీకి షాక్

(5వ పేజీ తరువాయి)

మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో సహా టీడీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీ హయాంలో ఎన్నికలు జరగనీయకుండా వైసీపీకి చెందిన వారే ఒక్కొక్కరు నామినేషన్ వేయడంతో 33 మంది సభ్యులు వైసీపీ కౌన్సిలర్లు కావడంతో పురపాలక సంఘం వైసీపీ ఖాతాలో జమ అయింది. మరో ఏడాదిలో ఎన్నికలు వుండగా ఇప్పుడు 17 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరడంతో వైసీపీకి షాక్ ఇచ్చినట్లు అయింది.

మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా భారతి ఏకగ్రీవ ఎన్నిక

పిడుగురాళ్ల పురపాలక సంఘం 30వ వార్డు కౌన్సిలర్‌గా వున్నం భారతి వైస్‌చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి వి మురళీకృష్ణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. వైసీపీకి చెందిన 17 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాగా 30వ వార్డు కౌన్సిలర్ వున్నం భారతి పేరును 28వ వార్డు కౌన్సిలర్ గర్రె నాగేశ్వరరావు ప్రతిపాదించగా 20వ వార్డు కౌన్సిలర్ కొత్త తులసి బలపరచగా మిగిలిన సభ్యులు ఆమోదం తెలిపారు. దీంతో వున్నం భారతిని వైస్‌చైర్మన్‌గా ధృవీకరిస్తూ ప్రత్యేక అధికారి మురళీకృష్ణ నియామకపత్రాన్ని భారతికి అందజేశారు. అనంతరం 17 మంది కౌన్సిలర్లు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలో చేరారు.

అభివృద్ధి యరపతినేనితోనే సాధ్యం : చైర్మన్ చినసుబ్బారావు

గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతోనే సాధ్యమవుతుందని తామంతా టీడీపీలో స్వచ్ఛందంగా చేరుతున్నామని ఛైర్‌పర్సన్ కొత్త చినసుబ్బారావు, మరికొందరు కౌన్సిలర్లు తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో అభివృద్ధే తారక మంత్రంగా తాను పనిచేస్తున్నానని, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికకు వైసీపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా వున్నం భారతిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచకపాలనలో అనేక విధ్వంసాలకు పాల్పడ్డారే తప్ప అభివృద్ధి జోలికి వెళ్లలేదన్నారు. పురపాలక సంఘ భవనానికి తమ హయాంలోనే 2 కోట్ల రూపాయలు మంజూరు చేయించానన్నారు. రాబోయే ఐదేళ్లకు ఏమేమి అభివృద్ధి సాధించాలో ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నామన్నారు. టిడ్కో గృహాలు, రహదారుల విస్తరణ, మంచినీటి పథకానికి నిధులు మంజూరు చేయడం తెలుగుదేశం పార్టీ ఘనత అన్నారు.



వైస్ చైర్మన్ ఎన్నికకు హాజరైన కౌన్సిలర్లు

తిరుణాళ్ళను విజయవంతం చేద్దాం

◆ కోటప్పకొండలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి గొట్టిపాటి ◆ భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచన



కోటప్పకొండలో తిరుణాళ్ళ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ తిరుణాళ్ళ ఏర్పాట్లను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేద్దామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 26వ తేదీన రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు రానున్న సందర్భంగా తిరుణాళ్ళ ఏర్పాట్లను సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. కోటప్పకొండకు తరలివచ్చే భారీ విద్యుత్ ప్రబలు వచ్చే రహదారి, భక్తులు కొండకు చేరుకునే రహదారుల నిర్మాణం, మరమ్మతులు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కొండపై భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న తాటాకు చలువ పందిళ్ళు, క్యూలైన్లు, ఘాట్‌రోడ్డులో కాలింది విగ్రహం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేలప్రోలు రమేష్, కడియం కోటి సుబ్బారావు, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అమరావతిలో శరవేగంగా ఇగ్నో వర్సిటీ నిర్మాణ పనులు

❖ నాక్‌లో ఏ ప్లస్ ప్లస్ హైయస్ట్ గ్రేడ్ కలిగిన విశ్వవిద్యాలయం
❖ జీ ప్లస్ 7తో పౌండేషన్ - ప్రస్తుతం జీ ప్లస్ 2తో నిర్మాణం



రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు రెవెన్యూలో నిర్మాణం జరుగుతున్న ఇగ్నో భవనం

తుళ్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) స్టడీ సెంటర్ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు ఎకరాల విస్తీర్ణంలో జీ ప్లస్ 7 అంతస్థుల నిర్మాణానికి వీలుగా పౌండేషన్ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పనులు మొదటి శ్లాబ్ దశకు చేరుకున్నాయి. జీ ప్లస్ 2 అంతస్థులతో ఇప్పుడు నిర్మాణం చేస్తున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మిగిలిన అంతస్థుల నిర్మాణం ఉంటుందని అధికారులు చెపుతున్నారు. తుళ్లూరు రెవెన్యూలో ఎన్ 13, 14 ప్రధాన రోడ్ల మధ్యలో దీని నిర్మాణం చేపట్టారు.

ఇగ్నో ప్రత్యేకతలు

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్శిటీకి స్టడీ సెంటర్‌లున్నాయి. ఇందులో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని డిగ్రీ పట్టాలు సాధించిన వారికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉంటుంది. ఇది గమనించే గత టీడీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని ఎడ్యుకేషనల్ హబ్‌గా చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించి స్థలాన్ని కేటాయించారు. ఇగ్నో సెంట్రల్ యూనివర్శిటీగా ఉంది. యూజీసీ అనుమతులున్న ఎడ్యుకేషన్ సంస్థ. ఇందులో చదివితే ఉద్యోగ ఉపాధి అవకాశాల తోపాటు, ఉన్నత చదువులకు ఎలిజిబులిటీ ఉంటుంది. అన్నీ రాష్ట్రాల్లో ఇగ్నోస్టడీ సెంటర్‌లున్నాయి. సుమారుగా 67 రీజినల్ సెంటర్‌లు, రెండు వేలు లెర్నింగ్, సపోర్టింగ్ సెంటర్‌లు దేశవ్యాప్తంగా ఇగ్నోకి ఉన్నాయి. నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడిడేషన్ కౌన్సిల్ (నాక్)లో హైయస్ట్ గ్రేడ్ (ఏ ప్లస్ ప్లస్)కలిగి ఉన్న ప్రథమ సార్వత్రిక విశ్వదాలయంగా ఇగ్నో ఉంది. అటువంటి విశ్వవిద్యాలయంలో చదువుకోవటానికి ఏపీ రాజధాని అమరావతిలో అవకాశం ఏర్పడబోతుంది.

320 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఫిబ్రవరి 17: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 320 బస్తాల పసుపును రైతుల విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,600 గరిష్ఠ ధర రూ.9,800 మోడల్ ధర రూ.9,800 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,551, గరిష్ఠ ధర రూ.9,700 మోడల్‌ధర రూ.9,700 పలికాయి.

పశ్చిమ డెల్టాకాల్వకు నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1716 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.9 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 80, రేపల్లెకాల్వకు 196, తూర్పుకాల్వకు 187, పశ్చిమకాల్వకు 30, నిజాంపట్నంకాల్వకు 80, కొమ్మమూరుకాల్వకు 496 క్యూసెక్కులనీరు విడుదల చేస్తు న్నారు.

నిత్య అన్నదాన పథకానికి రూ.51,116 విరాళం

పెదకాకాని, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి నూతక్కి గ్రామానికి చెందిన బొల్లా సాంబిరెడ్డి, విజయలక్ష్మి దంపతులు సోమవారం రూ. 51,116 విరాళం అందించి నట్లు దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

ఆత్మకూరులో అగ్నిప్రమాదం

మంగళగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నిర్మల కాన్వెంట్ సమీపంలోని ఓ స్క్రాప్ వ్యాపార దుకాణంలో సోమ వారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. దుకాణంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో యజమాని బాపనపల్లి ఏడుకొండలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వర్లు సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

నేడు పట్టభద్రులతో సమావేశం

పెదనందిపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పట్టభద్రులు, ఎన్నికల అబ్యర్థలతో మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం పలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా పట్టభద్రులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో ఎనిమిది మందికి ఉద్యోగాలు

తాడికొండ(లాం), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పీపుల్ టెక్ గ్రూప్ సంస్థ చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలను సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో పాల్గొన్నారని తెలిపారు. రిటర్న్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన వారికి వార్షిక వేతనం రూ.2.4 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లభిస్తుందన్నారు. ఉద్యోగా లు సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరి వై సుజిత్‌కుమార్ అభినందించారు.

సమస్యలు పరిష్కారించాలి

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజయవాడ గొల్లపూడిలోని పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఏ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. పత్తిపాడు తాలూకా యూనిట్ ఎన్‌జీవో అసోసియేషన్ కార్యదర్శి కే శేషగిరిరాజు బృందం సోమవారం ఆమెను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అలాగే వివిధ అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్టు శేష గిరిరాజు వెల్లడించారు.

టోల్‌ప్లాజాను తొలగించాలి

మంగళగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-విజయవాడ నగరాల మధ్యన మంగళగిరి మండలం కాజ గ్రామ పరిధిలో వున్న టోల్‌ప్లాజాను తొలగించాలని మంగళగిరి ప్రయాణికుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ బాలవెంకట్రావు, నన్నపనేని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ టోల్ ఫీజులు పెంచడం వల్ల విజయవాడ, గుంటూరు పరిధిలోని అనేక మంది వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో మంగళగిరి ప్రాంత వాహనాలకు రూ.150 ఉండే నెలవారీ లోట్ పాస్ ప్రస్తుతం రూ.340 ఉందని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. చైతన్యం కలిగిన మంగళగిరి ప్రాంతంలో ఎవరైనా హైకోర్టు న్యాయవాదులు ఈ విషయమై పిటిషన్ వేయాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఈ నెల 18 నుంచి 21 వరకు, 24 నుంచి 28వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంటీఎంసీ అదనపు కమిషనరు కే.శకుంతల తెలిపారు. ఆరు సంవత్సరాలలోపు పిల్లకు ఆధార్ కార్డులు జారీ చేయడం, బయోమె ట్రిక్, మార్పులు చేర్పులు చేస్తారన్నారు. గండాలయ పేట, ద్వార కానగర్, సూర్యనారాయణనగర్, ఉండవల్లి సెంటరు, కొలనుకొండ సచివాలయాల పరిధి లో షెడ్యూల్ ప్రకారం ఒక్కో రోజు ఒక్కో ఏరియాలు ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు.

‘పది’ పరీక్షలు ప్రశాంతంగా జరగాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి



పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలను విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతవరణంలో, సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లా అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభమవుతాయన్నారు. జిల్లాలో 470 పాఠశాలలకు సంబంధించి రెగ్యులర్ విద్యార్థులు 29,499 మంది, ప్రైవేటుగా 961 మంది కలిపి మొత్తం 30,460 మంది విద్యార్థులు 150 కేంద్రాల్లో పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి, సమీప ప్రాంతా ల్లోని జిరాక్స్ సెంటర్లు మూసి వేయించాలని, పోలీస్‌శాఖతో అవసరమైన బందోబస్తు ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్ లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పారిశుధ్యం పనులు, మంచినీటి ఏర్పాటుకు మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల అవసరం మేరకు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డ్వామా పీడీ శంకర్, డీఈవో రేణుక, డీఎంహెచ్‌వో డా. విజయలక్ష్మి, ఎస్బీ సీఐ శ్రీనివాసరావు, ఎంవీఐ గోపాల్, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, సీపీడీసీఎల్ డీఈ ప్రసాద్, జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటరెడ్డి, గుంటూరు పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ రవిశేఖర్, తెనాలి అసిస్టెంట్ సూపరింటెం డెంట్ పాంచజన్యరెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజరు డీ ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్
● వివిధ ప్రాంతాల్లో నేతల ఎన్నికల ప్రచారం



లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్య ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ కోరారు. సోమవారం లాం, మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎన్నికల ప్రచారాన్ని కూటమి నేతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి గెలుపునకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, టీడీపీ సీనియర్ నాయకులు దాసరి రాజా మాస్టారు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంతేటి బ్రహ్మయ్య, కంచర్ల శివరామయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, చలపతి విద్యా సంస్థ ల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు, దాసరి రాజా మస్టార్, సర్పంచ్ అబిదాఅలీ టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను అఖండ మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య అన్నారు. పెదనందిపాడులో సోమవారం ప్రభుత్వ కార్యాలయాలు, పీఏఎస్ కళాశాలలో ఉన్న పట్టభద్రులను కలిసి తమ మొదటి ప్రాధాన్య ఓటు ఆలపాటికి వేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు దివ్వి నాగరాజు, రాజారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి తరఫున పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మద్దతుగా మంగళగిరి పట్టణంలో కూటమి నేతలు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటునువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరిరావు, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, కూటమి నేతలు జొన్నాదుల బాలకృష్ణ, వాకా మాధవరావు, వూట్ల దుర్గామల్లేశ్వరీ, అన్నం నాగబాబు, కాండ్రు భానుకిశోర్, రాఘవ, రాజశేఖర్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో జాతీయ స్థాయి చిత్రమేళా

తాడేపల్లి(వడ్డేశ్వరం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూని వర్సిటి స్టూడెంట్ యాక్టివిటి సెంటర్ ఆధ్వర్యంలోని ఫిల్మ్ టెక్నాలజీ క్లబ్ ఎంతో ప్రతిష్ఠాత్మ కంగా నిర్వహించిన చిత్రమేళాకు విశేష స్పందన లభించింది. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు పాల్గొని వారు రూపొందించిన షార్ట్‌ఫిల్మ్స్, లఘుచిత్రాలు, ఫొటోగ్రఫీ, రీల్స్ తయారీలో పాల్గొని తమ సృజనాత్మకతను, ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా తెలుగుచిత్ర పరిశ్రమ అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణ్ ఈకార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగిస్తూ రాబోయే రోజుల్లో చిత్రపరిశ్రమలో మరింత మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ యాక్టివిటి సెంటర్ డైరెక్టర్ పీ సాయి విజయ్, డీన్ ప్రొఫెసర్ కేఆర్ ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ శ్రీధర్, పావనిలు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు.



చిత్రమేళాను ప్రారంభిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణ్, కేఎల్‌యూ శాక్ డైరెక్టర్ సాయివిజయ్

విజేతగా విజ్ఞాన్ యూనివర్సిటి

షార్ట్ ఫిల్మ్ పోటీల్లో మార్పు అనే అంశంపై విజ్ఞాన్ యూనివర్సిటి విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకోగా ద్వితీయ బహుమతిని కేఎల్‌యూ (ఇచ్చాదారి) తృతీయ బహు మతిని నిట్, తాడేపల్లిగూడెం (ది బ్లైండ్) గెలుచుకున్నారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ శ్యామ్‌సుందర్, ప్రొఫెసర్ రాజా, బికాస్‌శర్మ, ఫిల్మ్ టెక్నాలజీ క్లబ్ లీడ్ అమిష్‌కుమార్, ఆర్యని, విద్యార్థి నిర్వహకులుగా వ్యవహరించారు.

సమస్యలపై అంగన్‌వాడీల నిరసన



ప్రత్తిపాడులో సూపర్‌వైజర్‌కు మెమోరాండం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీ లక్ష్మణరావు, ప్రత్తిపాడు ప్రాజెక్టు అధ్యక్షురాలు ప్రేమలత


మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. సీఐటీయూ నేతలు వేముల దుర్గారావు, ఎం బాలాజీ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు హేమలత, రుక్మిణి, సరళ, సుజాత, మేరీ, కోటేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు సీడీపీవో కార్యాలయం వద్ద..

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్క్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ప్రత్తిపాడు సీడీపీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలంటూ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి బీ లక్ష్మణరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయకపోతే బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలందరూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు ప్రేమలత, కరీమూన్, శశికళ, అనురాధ, పద్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారైలో ముగిసిన పెరిటానాలజీ సదస్సు

మంగళగిరిసిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరిటానాలజీ అండ్ రిప్రొడక్టివ్ మెడిసిన్ 40వ జాతీయ సదస్సు చినకాకాని ఎన్నారై వైద్య కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించారు. ఐఎస్‌వోపీఏఆర్‌బీ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి 450 మంది ప్రతినిధులు హాజర య్యారు. పెరినాటాలజీ, రిప్రొడక్టివ్ మెడిసిన్‌లోని కీలక అంశాలపై వక్తలు ప్రసంగించారు. క్విజ్, సింపోజియా, ప్యానెల్ చర్చలు జరిగాయి. మూడు రోజుల సదస్సుకు ఐఎస్‌వోపీఏ ఆర్‌బీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నారాయణ జానా, కార్యదర్శి డాక్టర్ ప్రజ్ఞా మిశ్రా చౌదరి, ఎన్టీఆర్‌యూహెచ్ఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి హాజరయ్యారు. ఐఎస్‌వోపీఏఆర్‌బీ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ సులేఖాపాండే బాధ్యతలు చేపట్టారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వివిధ విభాగాలు వైద్యులు

ఈ సదస్సులో ఐఎస్ వోపీఏఆర్‌బీ విజయవాడ చాప్టర్ అధ్యక్షురాలు డాక్టర్ కే గీతాదేవి, కార్యదర్శి డాక్టర్ కే లత, పోషకురాలు డాక్టర్ ఆర్ఎస్ రమాదేవి, ఏపీఎంసీ పరిశీలకులు డాక్టర్ కే ప్రభాదేవి, ఎన్నారై ఓబీజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ కే.గంగా ధరరావు, సైంటిఫిక్‌చైర్ డాక్టర్ వి.పద్మజ, ఓబీజీ సొసైటీ విజయవాడ అధ్యక్షురాలు డాక్టర్ వీ.శ్రీదేవి పాల్గొన్నారు.

బంగారు నగల దోపిడీపై దర్యాప్తు ముమ్మరం

మంగళగిరిసిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో సంచలనం రేకెత్తించిన 4.9 కిలోల బంగారు ఆభరణాల దోపిడీపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. చోరీ జరిగిందని బాధితుడు చెప్పిన విధానాలకు సరైన ఆధారాలు లభించడం లేదు. బంగారం దోపిడీ ఘటనను పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఎస్పీ సతీశ్‌కుమార్ సోమవారం సాయంత్రం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్రైమ్ అడిషనల్ ఎస్పీతోపాటు మంగళగిరి, పెదకాకాని సీఐల ఆధ్వర్యంలో మూడు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంగళగిరి, విజయవాడలోని దుకాణంలోని పలువురిని విచారిస్తున్నారు.

అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు కేటాయించాలి

దుగ్గిరాల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ నివేశనస్థలాలు గ్రామం లోనే కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ ఐ సునీతకు వినతిపత్రం అందించారు. చిలువూరుకు చెందిన మహిళలు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరు కుని, నివేశన స్థలాలకై కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ లీగల్‌సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ మాట్లాడుతూ గత ప్రభుత్వం 200 మందికి పైగా పేదలకు గ్రామానికి దూరంగా ఎలాంటి వసతులు లేని, కేఆర్‌కొండూరుకు ఐదు కిలోమీటర్ల దూరంలో మంజూరు కేటాయించిన స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్లులేని పేదలకు స్థలాలు మంజూరు చేస్తామని ప్రకటించడంతో పేదలు ఆశాభావంతో ఉన్నారని, గ్రామంలోనే స్థలసేకరణ చేసి, వీలైనంత త్వరగా ఇళ్లస్థలాలిచ్చి, ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశా రు. గ్రామానికి చెందిన 100 మందికి పైగా పేద మహిళలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ ఏటుకూరి విజయ్‌మాదిగ, కిన్నెర నాగరాజు మాదిగ, కనపాల బాజి మాదిగ, మోజేస్ మాదిగ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

రూ.33 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి చెక్కులు 33 లక్షల 14 వేల399 రూపాయలు 29 మంది బాధితులకు ఎమ్మెల్యే తెనాలిశ్రావణ్‌కుమార్ పంపిణీ చేశారు. సోమవారం గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కు లను ఆయా గ్రామాల నాయకులతో కలిసి అందజేశారు. నెలకుదిటి కృష్ణారావుకు రూ.1.5లక్ష, పటాలం గలీబ్‌కు రూ.47,205లు, ఆమతి నాగార్జునకు రూ.2,41,352లు, మాస్టర్ జే. నాగమణికంఠకు రూ.1,56,487లు, మువ్వా భూలక్ష్మీకి రూ.1,62,000లు, నక్కా లక్ష్మీ నారా యణకు రూ.30,786లు, కోట అశోక్‌కుమార్‌కు రూ.43,001లు మర్రి శ్రీదేవికి రూ.30వేలు, తాటి శ్రీనివాస్‌రావుకు రూ.45వేలు, యడం చైతన్యకు రూ.1,23,762లు, పుల్లపు ఏడుకొండలుకు రూ.2,38,857లు, నీలం సురేష్‌కు రూ.1,43,192లు, కంబాల భార్గవ్‌సన్నీకు రూ.40 వేలు, అంచుల రాజేశ్వరికి రూ.44,836లు, గోశాల చైతన్యకు రూ.40,013లు, పోటుగుంట్ల ఉదయశ్రీకి రూ.37,000లు, బొండాల రామారావుకు రూ.25,166లు, కట్టెపోగు ఏసుబాబు కు రూ.75,000లు, కొమ్మినేని వెంకయమ్మకు రూ.84,037లు, షేక్ కరీముల్లాకు రూ. 2లక్షల 30వేలు, గరికపాటి తిరుపతమ్మకు రూ.81వేలు, కొండవీటి శ్రీనివాసరావుకు రూ. 90వేలు, కితావత్ శ్రీనుకు రూ.80వేలు, బొగ్గవరపు జాన్‌కు రూ.2,44,454లు, షేక్ మౌలా లికి రూ.1,08,600లు, జాస్తి సత్యనారాయణకు రూ.81,864లు, పాలకాయల చిన్న వెంక య్యకు రూ.2,35,303లు, పొన్నం విజయలక్ష్మికి రూ.2,66,296లు, ఆకారపు సాంబయ్యకు రూ.1,76,052ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

వైభవంగా మహాన గణపతి స్వామి స్వామివారి కల్యాణోత్సవం

తాడేపల్లి(మెల్లెంపూడి), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మెల్లెంపూడిలోని శ్రీసిద్ధిబుద్ధి సమేత మహాన గణపతి స్వామి ఆలయం 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి స్వామికి ప్రత్యేక అభిషేకాలు, ద్వాదశ ఫలాభిషేకం, గణపతి హోమం, శ్రీసిద్ధిబుద్ధి సమేత మహాన గణపతి స్వామి దివ్య కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ 19 ఏళ్లగా ప్రతి ఏడాది మహాగణపతి స్వామి ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టుగా తెలిపారు. 2వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజారామిరెడ్డి, దొంతిరెడ్డి వెంకట శివ రామకృష్ణారెడ్డి, కుర్రె మల్లారెడ్డి, దొంతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఉయ్యూరు శివరామిరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గ్రామపెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, మహిళా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం ..

ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెంపూడిలో మంగళవారం శ్రీప్రసన్నాంజనేయ స్వామి పదో వార్షిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.



పెదకొండూరు వ్యవసాయక్షేత్రంలో యూరోపియన్ ప్రతినిధి బృందానికి ప్రకృతిసాగు గురించి వివరిస్తున్న ఫార్మర్ సైంటిస్ట్ సోమరౌతు దిలీప్, డీపీఎం రాజకుమారి

ప్రకృతి సాగులో ప్రపంచ నమూనా ఆంధ్రప్రదేశ్

● యూరోపియన్ ప్రతినిధి బృందం ప్రశంసలు

గుంటూరు సిటీ, మంగళగిరి, దుగ్గిరాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ప్రపంచ దేశాలను ఆకర్షిస్తున్నాయి. ఐదు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వచ్చిన యూరోపియన్ ప్రతినిధిబృందం సోమవారం గుంటూరు జిల్లాలోని మంగళగిరి మండలం నూతక్కి, రూరల్ మండలం గోరంట్ల, దుగ్గిరాల మండలం పెదకొండూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. అనంతరం యూరోపియన్ ప్రతినిధి బెన్నెడిక్ట్ హెర్లిన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి నమూనాగా మారిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ద్వారా అమలు చేస్తున్న ఏటీఎం (ఎనీ టైమ్ మనీ) మోడల్ తమను ఎంతో ఆకట్టుకొందని, రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచే విషయంలో ఈ నమూనా గేమ్ చేంజర్‌గా పనిచేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్‌కుమార్ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ఆరంభం నుంచి అమలైన విధానం, విస్తరణ, సాధించిన ప్రగతి, అనుసరిస్తున్న వివిధ నమూనాల గురించి బృంద సభ్యులకు వివరించారు. ఈ బృందంలో ఫౌండే షన్ ఆన్ ఫ్యూచర్ ఫార్మింగ్ తరఫున జాస్పర్ జోర్డాన్, బెన్నెడిక్ట్ హెర్లిన్, పోర్చుగల్‌కు చెందిన ప్రాజెక్టు ఎర్త్ ప్రతినిధి డియోగో కౌటినో, అటెలియర్ ఫుడ్ సిస్టమ్ చేంజ్ ప్రతినిధి లూకాస్ కేహ్లే ఉన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థకు చెందిన సీనియర్ అధికా రులు సీనియర్ అధికారులు డాక్టర్ వరప్రసాద్, ప్రకాష్‌రావు, సీహెచ్ శ్రీనివాసులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారానికి వ్యతిరేకంగా పోరాటం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారానికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో పోరాటాలు చేయనున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు తెలిపారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలు తగ్గి స్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం గత 8 నెలల కాలంలో రూ.15,482 కోట్ల భారాన్ని సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై మోపిందని విమర్శించారు. వీటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజలతో కలిసి ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం నేతలు వై నేతాజీ, పాశం రామారావు, ఎం రవి, ఈమని అప్పారావు, వీవీ జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

● ఎంఈవోకు ఎండీఎం కార్మికుల వినతి

పెదనందిపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ కార్మిక సంఘ నాయకులు సోమవారం ఎంఈవో ముద్దన శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్మికులంతా పేద కుటుంబాలకు చెందిన వారని, బిల్లులు చెల్లించకపోవడంతో అప్పు చేసి విద్యార్థులకు భోజనం వండాల్సి వస్తుందని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం ఏడునెలలుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలు, బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి షేక్ షమీ, నాయకులు మర్రి లక్ష్మి, కొరివి విజయలక్ష్మి, కే శివలీల, ధనలక్ష్మి, యలమర్తి లక్ష్మి, ఈశ్వరి, అనూష, రైతు సంఘ నాయకులు కొత్త వెంకటశివరావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో విషరహిత ఆహారం

● ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి

కొల్లిపర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రసాయన, పురుగు మందులు లేని విషరహిత ఆహారం అందించడంలో ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయం అవరణలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూర పంటలను కొల్లిపర మండల మోడల్ టీమ్ ప్రదర్శన నిర్వహించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల పంటలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వలన రోగాల బారిన పడ కుండా ఉండటానికి అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రతి కుటుంబం కూడా కావల సిన ఆకుకూరలు, కూరగాయలను పెరట్లో పండించుకుని తింటే ఆరోగ్యంగా ఉంటార న్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలు నాగజ్యోతి, సుధా రాణి, ఎంటీలు పరిశుద్ధకుమారి, రాజకు మారి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో పంచముఖ గాయత్రి అమ్మవారు

కొలకలూరులో వైభవంగా చండీయాగం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు శ్రీపంచ ముఖ గాయత్రి అమ్మవారి ఆలయంలో చండీయాగ పూజలు వైభవంగా నిర్వహిం చారు. ఆదివారం ఆలయంలో పంచముఖ గాయత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించి అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మ కర్త నాగం నాగేంద్రరావు, సావిత్రి దంపతు లు చండీయాగ పూజలు జరిపారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం కనులపండువగా నిర్వహించి స్వామివార్ల అన్నప్రసాద వితరణ చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. విశ్వగాయత్రి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నంబూరు వెంకటకృష్ణ మూర్తి, కార్యదర్శి యఖం శెట్టి హనుమంత రావు, కోశాధికారి రమేష్‌బాబు, కార్యదర్శి జొన్నాదుల వెంకటేశ్వరరావు, పూరంశెట్టి ఆంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షిం చారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ నెట్‌వర్క్‌లో ఏఐ ఆధారిత పరిష్కారాలపై సదస్సు

పెదకాకాని, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వీవీఐటీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రా నిక్స్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఎనర్జీ డిస్‌ఎగ్రిగేషన్ ఏఐ బేస్డ్ సొల్యూషన్ మెథడ్స్ అండ్ అప్లికేషన్స్ అంశంపై అవగా హన సదస్సు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా సౌత్ కొరియా నేషనల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ రామ్మోహన్ మల్లిపెద్ది హాజరయ్యారు. డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ ఎనర్జీ డిస్‌ఎగ్రిగే షన్ పద్ధతి అంటే కరెంట్ మీటర్ నుంచి కరెంటు పరికరాల శక్తి వినియోగాన్ని వేరు చేసే ఓ టెక్నిక్ అని తెలిపారు. శక్తి వినియో గంలో అధునాతన ఆర్టిఫీషియల్ ఇంటెలి జెన్స్ ఉపయోగించి ఉపకరణాల వినియో గాన్ని పూర్తిస్థాయిలో విశ్లేషించవచ్చని తద్వారా ఉపకరణాల పనితీరును మెరుగుప రుచుకోవడం, శక్తి వినియోగాన్ని తగ్గించుకో వడం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సి పాల్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ కె.గి రిబాబు, ఈఈఈ విభాగాధిపతి ఏవీ సరేష్ బాబు, సీహెచ్ నాగసాయికళ్యాణ్, విద్యా ర్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

● కిరణ్‌కుమార్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరి ష్కరిస్తూ వారికి యూనియన్ తరుపున అండగా ఉంటానని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ చెప్పారు. సోమవారం పట్టణం లోని తహసీల్దార్ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాలకృష్ణతో కలిసి అసోసియేషన్ క్యాలెండర్లను ఆవిష్క రించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్రావు, తెనాలి డివిజన్ కార్యదర్శి చంద్ర శేఖర్, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి షేక్ అయూబ్, కుమార్, మహేష్, నాగశంకరయ్య, ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. చంద్ర బాబు నాయుడు కాలనీలోని మునిసిపల్ పాఠశాలలో క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల కృష్ణమో హన్ సహకారంతో నిర్వహించిన కార్యక్ర మంలో కాకరపర్తి సుబ్రహ్మణ్యం, వరప్ర సాద్, రాంప్రసాద్, శ్రీనివాసరావు తదిత రులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

● కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలను విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతవరణంలో, సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలె క్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లా అధికారులతో సమ న్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. జిల్లాలో 470 పాఠశాలలకు సంబంధించి రెగ్యులర్ విద్యార్థులు 29,499మంది, ప్రైవేటుగా 961మంది కలిపి మొత్తం 30,460 మంది విద్యార్థులు 150 కేంద్రాల్లో పరీ క్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45వరకు జరుగుతాయ న్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి, సమీప ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లు మూసివేయించా



పదో తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

లని, పోలీస్‌శాఖతో అవసరమైన బందోబస్తు ఏర్పా టుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పారిశుధ్యం పనులు, తాగునీటి ఏర్పా టుకు మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల అవసరం మేరకు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారు లకు సూచించారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎ్ ఎకే ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, డ్వామా పీడీ శంకర్, డీఈవో రేణుక, డీఎంహెచ్‌వో డా. విజయలక్ష్మి, ఎస్సీ సీఐ శ్రీని వాసరావు, ఎంపీఐ గోపాల్, నగరపాలక సంస్థ డిప్యూటీ కమి షనర్ శ్రీనివాస్, సీపీడీసీఎల్ డీఈ ప్రసాద్, జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంక టరెడ్డి, గుంటూరు పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ రవిశే ఖర్, తెనాలి అసిస్టెంట్ సూపరింటెం డెంట్ పాంచజన్య రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజరు డీ ఆదినారాయణ తదిత రులు పాల్గొన్నారు.

అందరూ సమన్వయంతో పనిచేయాలి

క్వారీ తిరునాళ్ల ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ సంజనా సింహా



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహా

చేబ్రోలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): క్వారీ బాలకో టేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలు సజావుగా సాగేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వంతో పనిచేసి తెనాలి సల్‌కలెక్టర్ సంజనా సింహా అధికారులను ఆదేశించారు. సోమవారం వడ్లమూడిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద తెనాలి సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఉత్స వాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా సబ్ కలె క్టర్ మాట్లాడుతూ క్వారీ తిరునా ళ్లకు రెండు లక్షలకు పైగా భక్తులు వస్తారని అధికారులు వెల్లడిస్తున్నారన్నారు. తొలిరోజు జరిగే పశువుల ప్రదర్శన, రెండో రోజు జరిగే వాహన ప్రదర్శనలు, పొంగళ్ల మొక్కుబడులు, 26వ తేదీన జరిగే శివరాత్రి ఉత్సవా లకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా మహిళ భక్తులు నిర్వహించే పొంగళ్ల కార్యక్రమానికి అవాంతరాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎండలు పెరుగుతున్నందున అగ్నిమాపక శకటాన్ని సిద్ధంగా ఉంచాలని సూచిం చారు. గొడవర్రు, గుండవరం, నారాకోడూరు వైపు నుంచి భారీ విద్యుత్ ప్రభలు తరలిరానున్న నేపథ్యంలో ప్రభల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని ఆదేశించారు. ప్రభలకు అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్లను చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు క్యూలైన్ ఏర్పాట్లు, భక్తుల కోసం తాగునీరు మజ్జిగ ఏర్పాట్లు చేయాలన్నారు. వాటర్ ట్యాంకర్లు, మొబైల్ టాయిలెట్లు, డస్టబిన్‌లు, 104, 108 వాహనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో 25వ తేదీన మద్యం అమ్మకాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు సజావుగా సాగేలా జాగ్రత్తలు పాటించాల న్నారు. పార్కింగ్ సౌకర్యం, శాంతి భద్రతలను పోలీ సులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

సమావేశంలో ఈవో రామకోటేశ్వరరావు, ఫైర్ ఆఫీ సర్ మస్తాన్‌వలి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఎంపీడీవో లలిత, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి సంగమేశ్వరస్వామి ఆలయం ముస్తాబు

● వేలాదిగా తరలిరానున్న భక్తులు

● అధ్వానంగా రథోత్సవ మార్గం



రంగులతో మెరిసిపోతున్న బాలాత్రిపురసుందరీసమేత సంగమేశ్వరస్వామి ఆలయం, అధ్వానంగా ఉన్న రథోత్సవం జరిగే కొమ్మమూరు కాలువ కట్ట మార్గం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చరిత్ర ప్రసిద్ధి చెందిన సంగంజాగర్లమూడి బాలాత్రిపురసుందరీ సమేత సంగమేశ్వర స్వామి వారి ఆలయం మహాశివరాత్రి పర్వదిన ఉత్సవాలకు ముస్తాభవుతోంది. తెనాలి నుంచి గుంటూరు వెళ్లే మార్గంలోని సంగంజాగర్లమూడి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి రంగులు దిద్దుతూ, రథోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో విద్యుత్ ప్రభల ఏర్పాటు పనులు కూడా ప్రారంభించారు. ఈ నెల 23 నుంచి మార్చి 1వరకూ ఆల యంలో శివరాత్రి మహోత్సవ పూజలు జరగనున్నాయి. ఉత్సవాల తొలిరోజు ఆదివారం స్వామి వారిని పెండ్లికుమారుడిగా ముస్తాబు చేస్తారు. సోమవారం శేషవాహనంపై స్వామి వారి గ్రామోత్సవం, మంగళవారం నరనంది వాహనంపై స్వామివార్ల గ్రామో త్సవం జరుపుతారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారి అభిషేక పూజలు, గ్రామం నుంచి ఆలయంకు పెద్దఎత్తున ప్రభలు రాను న్నాయి. అదే రోజు స్వామి వార్ల గ్రామోత్సవానికి ప్రత్యేకరథం గ్రామం నుంచి ఆల యానికి తీసుకువస్తారు. అదే రోజు రాత్రి 11-30 నుండి స్వామి వారి లింగోద్భవకాల అభిషేకాలు జరగనున్నాయి. గురువారం ప్రభలపై స్వామివార్ల గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం విద్యుత్ దీపకాంతులతో స్వామివారి దివ్య రథో త్సవం వేలాది మంది భక్తులతో వైభవంగా జరగనుంది. శుక్రవారం వసంతోత్సవం, స్వామి వార్లగ్రామోత్సవం, శనివారం ద్వాదశ ప్రదక్షిణలు, ఏకాంత సేవతో ఉత్సవాలు ముగియనున్నాయి.

రోడ్డుకు మరమ్మతులు నిర్వహించరూ...

ఈ నెల 27న స్వామి వారి దివ్యరథోత్సవం జరగనుంది. ఆలయం నుంచి గ్రామోత్స వంగా గ్రామానికి సుమారుగా కిలోమీటరు మేర తీసుకురావాల్సి ఉంది. అయితే ఆలయం నుంచి గ్రామానికి వచ్చే రోడ్డు గుంతలమయంగా ఉండటంతో పాటు ఒక పక్క రోడ్డు కుంగిపోయింది. పక్కనే కొమ్మమూరుకాలువ ఉంది. రెండోవైపు పంటభూ ములకు అనువుగా పిచ్చిమొక్కలతో చిన్నపాటి కాలువ నిమ్మతోటలు ఉన్నాయి. ఈ మార్గంలో రథోత్సవం ప్రమాదకరమేనని పలువురు భావిస్తున్నారు. అధికారులు అప్ర మత్తమై రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి రథోత్సవానికి ఆటంకం లేకుండా చూడా లని పలువురు భక్తులు కోరుతున్నారు.

కాలువలో పడిన చిరువ్యాపారి

● మూడురోజుల అనంతరం గుర్తింపు

● కాపాడిన హోంగార్డులు

● సురక్షితంగా ఇంటికి తరలింపు



వ్యాపారిని ఒడ్డుకు చేరుస్తున్న హోంగార్డులు



చిరువ్యాపారి సుభానీతో హోంగార్డులు నాగేశ్వరావు, వెంకటేశ్వరావు, పేరయ్య తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలువలో పడిపోయిన చిరువ్యాపా రిని హోంగార్డులు కాపాడిన ఉదంతం తెనాలిలో చోటు చేసుకుంది. స్థానికులు, హోంగార్డులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మారీసుపేటకు చెందిన షేక్ సుభాని తోపుడుబండిపై పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగి స్తుంటాడు. మూడు రోజుల క్రితం మూత్ర విసర్జనకు మార్కెట్ సమీపంలో ప్రవహిస్తున్న కాలవ వద్దకు వెళ్లిన సమయంలో ఒక్కసారిగా తల తిరిగి ప్రమాద వశాత్తూ కాలువలో పడిపోయాడు. కాలువలో చెత్త కుప్పగా పేరుకొని ఉండటంతో నీటిలో మునగకుండా దానిపై ఉండిపోయాడు. అనంతరం అతనికి స్పృహ వచ్చేసరికి తలకు గాయమై కాలువలో ఉండటాన్ని గుర్తించాడు. బాగా నీరసంతో ఉన్న సుభాని గట్టిగా అరవలేని స్థితిలో అలాగే ఉండిపోవటంతో ఎవ్వరూ అతడిని గమనించలేదు. ఇలా ఉండగా సోమవారం ఓ వ్యక్తి మూత్రవిసర్జనకు వెళ్లి గడ్డిపై పడిఉన్న సుభానీని గుర్తించి పోలీసులకు తెలిపారు. తక్షణమే స్పందించిన హోంగార్డులు నాగేశ్వరావు, వెంకటేశ్వరావు, పేరయ్యలు కాలువలోకి దిగి క్షతగాత్రున్ని ఒడ్డుకు తీసుకువచ్చి సప ర్యలు చేశారు. బాగా నీరసించి ఉండటంతో ఆల్పా హారం అందించి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న సుభానిని బయటకు తీసుకొచ్చేందుకు హోంగార్డులు చేసిన కృషిని పలువురు అభినందించారు.

న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబ సభ్యుల రాస్తారోకో

● అంగలకుదురు వద్ద నిలిచిన ట్రాఫిక్

● పోలీసుల జోక్యంతో ధర్నా విరమణ



మృతదేహంతో రోడ్డుపై ధర్నా చేస్తున్న భార్య వెంకటేశ్వరమ్మ, ఆందోళనలో పాల్గొన్న కుటుంబసభ్యులు, బంధువులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణించిన వ్యక్తి భార్య, బంధువులు మృతదే హంతో రహదారిపై రాస్తారోకో చేసిన సంఘటన మండలంలోని అంగలకుదురు వద్ద జరిగింది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం తెనాలి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కోపల్లె గ్రామా నికి చెందిన ద్విచక్రవాహనం ఆర్టీసీ బస్సు ఢీ కొన్న ఘటనలో ఖగ్గ రవికుమార్ (35) తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని మృతదేహంతో అతడి భార్య, పిల్లలు, కుటుంబసభ్యులు కలిసి అంగలకుదురు ప్రధాన రహదారిపై తమకు న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మృతుని భార్య వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందాడని, తనకు తన కుటుంబసభ్యులకు పెద్దదిక్కు లేకుండా పోయిందని రోధించింది. ఆర్టీసీ యాజమాన్యం తమకు న్యాయం చేస్తామని చెప్పి తీరా మృతదేహాన్ని అంతిమసంస్కారాలు జరిపేందుకు తీసుకువెళ్లే క్రమంలో పట్టించుకోవడంలేదని ఆరోపించింది. బస్సు ఢీకొనటం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి రోడ్డున పడ్డామని కనీస మానవత్వం కూడా లేకుండా బస్సు నిర్వాహకులు, ఆర్టీసీ యాజమాన్యం ప్రవర్తిం చడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తన కుటుం బాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గుంటూరు - సంగంజాగర్లమూడి - తెనాలి ప్రధాన రహదారి కావ డంతో వేలాదిగా వచ్చే వాహనాల రాకపోకలు నిలిచి పోయి పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. పోలీ సులు ధర్నా జరుగుతున్న ప్రాంతానికి వచ్చి తాము న్యాయం జరిగేలా చూస్తామని మృతుడి కుటుంబస భ్యులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు

తెనాలి - గుంటూరు ప్రధాన రహదారి మధ్య అంగలకుదురు రోడ్డుపై మృతదేహంతో ధర్నా చేయ డంతో గంటపాటు రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్ప డింది. కళాశాలలు, స్కూల్స్ ఉద్యోగులు ఆఫీసు విధులు ముగించుకుని వచ్చే సమయం కావడంతో బస్సులు, ద్విచక్రవాహనాలు, ఆటోలు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని అందులో ప్రయాణించేవారు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. దాదాపుగా గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో అంగలకుదురు నుంచి సంగంజాగర్లమూడి శివారు వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.



భక్తులకు ఆలయ విశిష్టతను వివరిస్తున్న బాలస్వామి

పంచముఖ ఆంజనేయస్వామికి ప్రజ్ఞానంద సరస్వతి ప్రత్యేక పూజలు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక షరాఫ్‌బజార్ లోని శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ అంజనేయస్వామివారి దేవస్థానంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) అమ్మవారు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ తన బాల్యం ఈ దేవాలయంలోనే ఎక్కువ సమయం గడిపేవాడినన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ముందుగా బాలస్వామికి ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి స్వాగతం పలికారు. బాలస్వా మికి నూతన పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చ కులు రొంపిచర్ల కిరణ్‌కుమార్, ఈవో హరిబాబు, శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ సెక్రటరీ రావూరి సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, కోశాధికారి గోపు రామకృష్ణ, రాజేశ్వరావు, ప్రభారాణి, వరలక్ష్మి, ప్రమీల, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ ఈవో లీలాకుమార్‌కు నగదు అందజేస్తున్న దాతలు సాంబిరెడ్డి దంపతులు

నిత్యాన్నదాన పథకానికి రూ.51,116 విరాళం

పెదకాకాని, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవ స్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విరాళం ఇచ్చేందుకు భక్తులు ముందుకు వచ్చారు. ఈ మేరకు నూతక్కి గ్రామానికి చెందిన బొల్లా సాంబి రెడ్డి, విజయలక్ష్మి దంపతులు సోమవారం దేవస్థాన నిత్యాన్నదాన పథకానికి రూ.51,116లు విరాళం అందించినట్లు దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహ ణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అంద జేశారు.

పట్టభద్రులు మద్దతుగా నిలవాలి

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతికి పాటుపడు తున్న కూటమి ప్రభుత్వానికి పట్టభద్రులు మద్దతుగా నిలవాలని టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మండలం లోని దొప్పలపూడి గ్రామంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభు త్వంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, రాష్ట్ర మైనార్టీ కమిటీ సభ్యులు మొసిన్, స్థానిక టీడీపీ నాయకులు, మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్ల మూడి బాబూరావు, వెంకట్రావు, గనిపిశెట్టి రామకృష్ణ, పలు గ్రామాల పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలి: సాంబిరెడ్డి

కొల్లిపర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు. సోమవారం కొల్లిపరలో టీడీపీ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. పట్టభద్రులను, ఉద్యోగులను కలిసి ఓటు అభ్యర్థిం చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, నీటిసంఘ ఉపాధ్యక్షుడు ఆరి మండ శివనాగమల్లేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమ వరపు లంకకోటిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, షేక్ రఫీ, పోతురాజు పాల్గొన్నారు.

కొలకలూరులో...

తెనాలి రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కృష్ణా, గుంటూరు జిల్లాల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించు కుందామని కొలకలూరు కూటమి శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. సోమవారం గ్రామంలో పట్టభద్రులకు కరపత్రాలు అందచేశారు.

150 గోవా మద్యం బాటిళ్లు సీజ్

బాపట్లరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఒంగోలు సిబ్బందితో కలిసి ఉమ్మడిగా సోమవారం బాపట్ల మండలం స్టూవర్టుపురంలో దాడులను నిర్వహించారు. ఈ దాడులలో వల్లభ ఝాన్సీ అనే మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 150 గోవా మద్యం బాటిళ్ళను స్వాధీనంచేసుకుని సీజ్ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.గీతిక తెలిపారు.

రోడ్డు పక్కన వ్యర్థాలను కాల్చితే చర్యలు

● డీఎల్‌పీవో స్వరూపరాణి

కొల్లిపర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కన వ్యర్థాలను కాల్చితే తగిన చర్యలు తీసుకోనున్నట్లు డీఎల్‌పీవో విడవలూరి స్వరూపరాణి అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర పంచాయతీ కార్యాలయంలో ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పారిశు ధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ రోడ్లపక్కన చెత్తచెదారం లేకుండా చూచుకోవాలన్నారు. కాల్వల్లో మురుగునీరు తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టా లన్నారు. తనిఖీలో ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు తది తరులు ఉన్నారు.



కొల్లిపరలో పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో స్వరూపరాణి